

జేఈఈ మెయిన్స్‌లో మెరిశారు

విశాఖపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశాలకు సంబంధించి గత నెలలో నిర్వహించిన జేఈఈ సెక్షన్-1 పరీక్షల్లో విశాఖ విద్యార్థులు ర్యాంకులు సాధించారు. ఈ ఫలితాలు మంగళవారం రాత్రి విడుదలయ్యాయి. ఇప్పటి వరకు వచ్చిన సమాచారం మేరకు విశాఖకు చెందిన బీ.వి క్రమ్‌రాజ్ 99.997, డీబీఎస్‌బీ ప్రసాద్ 99.994, హరిచరణ్ 99.98 పర్సంటైల్ సాధించారు. కార్పొరేట్, ప్రైవేట్ కాలేజీ విద్యార్థులు 90.0 కంటే ఎక్కువ పర్సంటైల్ సాధించారు. సెక్షన్-2 పరీక్షలు ఏప్రిల్‌లో జరగనున్నాయి.

సంపతిపురం లేఅవుట్‌లో నకిలీ పట్టాలు

నాడు స్థానిక వైసీపీ నేత, రెవెన్యూ అధికారులు కుమ్మక్కు

- లేవుట్‌లో మొత్తం 355 ప్లాట్లు
- కొత్తూరు పంచాయతీకి చెందిన 303 మంది పేదలకు పట్టాలు
- మిగిలిన 52 స్థలాలు అనధికారికంగా అనర్హులకు కేటాయింపు
- ఒక్కొక్కరి నుంచి రూ.2-3 లక్షలు వసూలు
- ఇళ్లు నిర్మించుకుంటున్న నకిలీ పట్టాదారులు
- వైసీపీ నేత దందాపై అధికారులకు స్థానికులు ఫిర్యాదు
- కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కూడా పట్టించుకోని వైనం




సంపతిపురంలో కొంతమందికి నకిలీ పట్టాలు జారీ చేసిన ఇళ్ల కాలనీ

కొత్తూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్రంలో ప్రభుత్వం మారినప్పటికీ అనకాపల్లి మండలంలో ఇప్పటికీ కొంతమంది వైసీపీ నేతల హవా కొనసాగుతున్నది. వీరికి ఆయా శాఖల అధికారులు తమవంతు సహకారం అందిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొత్తూరు పంచాయతీలోని పేదలకు సొంత గూడు కోసం సంపతిపురం పంచాయతీ పరిధిలో వేసిన ఇళ్ల స్థలాల లేఅవుట్లలో పలువురు అనర్హులకు పట్టాలు మంజూరు చేశారు. మండలానికి చెందిన ఒక ప్రజాప్రతినిధి కుమారుడు తెరవెనుక కథ నడిపించి, ఒక్కొక్కరి నుంచి రూ.2-3 లక్షలు వసూలు చేసినట్టు తెలిసింది. స్థలాలు పొందిన వ్యక్తుల్లో కొంతమంది ఇళ్ల నిర్మాణం చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అక్రమంగా ఇళ్ల స్థలాల కేటాయింపుపై స్థానికులు ఫిర్యాదు చేసినప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. ఇళ్ల నిర్మాణం కొనసాగుతూనే వుంది. గృహ నిర్మాణ శాఖ అధికారులు మాత్రం తమ జాబితాలో పేర్లు లేనివారు ఇళ్ల నిర్మించుకున్నప్పటికీ బిల్లులు మాత్రం మంజూరు కావని చెబుతున్నారు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి.

అనకాపల్లి మండలంలో కొత్తూరు మేజర్ పంచాయతీలో సొంత ఇళ్లు లేని పేదలకు గత ప్రభుత్వం సంపతిపురం రెవెన్యూ పరిధి సర్వే నంబరు 2/2లో 7.7 ఎకరాల్లో లేఅవుట్ వేసింది. ఒక్కో ప్లాట్ సెంటున్నర (72 గజాలు) చొప్పున మొత్తం 355 ప్లాట్లు వేశారు. కొత్తూరు పంచాయతీకి చెందిన 303 మంది లబ్ధిదారులకు లాటరీ ద్వారా స్థలాలను మంజూరు చేసి పట్టాలు అందజేశారు అనంతరం పక్కా ఇళ్లు కూడా మంజూరు చేశారు. లేఅవుట్‌లో మరో 52 ప్లాట్లు మిగిలాయి. దీంతో వైసీపీకి చెందిన ఒక ప్రజాప్రతినిధి కుమారుడు, రెవెన్యూ ఉద్యోగులు కుమ్మక్కయ్యారు. లేఅవుట్‌లో మిగిలిన ప్లాట్లకు నకిలీ పట్టాలు తయారు చేశారు. వీటిని సదరు వైసీపీ నాయకుడు తన అనుచరులకు పంచడంతో ఒక్కో ప్లాట్ రూ.2-3 లక్షలకు అమ్ముకున్నారు. కొనుగోలు చేసిన వారిలో ఎక్కువ మంది మునగపాక మండలానికి చెందిన వారని తెలిసింది. ప్రభుత్వం నుంచి పక్కా ఇళ్లు మంజూరు కావని, మీరే సొంతంగా నిర్మించుకోవాలని ఆయా కొనుగోలుదారులకు చెప్పారు. మొత్తం మీద కోటి రూపాయలకుపైగా దండుకుని పంచుకున్నారు. అనధికారికంగా స్థలాలు పొందిన వారిలో కొంతమంది ఇళ్ల నిర్మాణం చేపట్టారు. సంపతిపురం లేఅవుట్‌లో అనర్హులకు, అనధికారికంగా ప్లాట్లు కేటాయించారని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అప్పట్లోనే కొంతమంది స్థానికులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ ఎటువంటి విచారణ జరపలేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నకిలీ పట్టాల బాగోతం బయటపడుతుందేమోనన్న భయంతో గతంలో అక్రమంగా పట్టాలు పొందిన వారిలో కొంతమంది ప్లాట్లను అమ్మకోవడం మొదలుపెట్టారు. అయితే వారు భయపడినట్టుగా కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఇంతవరకు విచారణ చేపట్టలేదు.. అక్రమంగా జారీ అయిన పట్టాలను రద్దు చేయలేదు. గృహ నిర్మాణాలను పర్యవేక్షించే అధికారులు సైతం తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. అయితే ప్రభుత్వం అధికారికంగా పట్టాలు జారీ చేసిన లబ్ధిదారులకు మాత్రమే ఇళ్ల బిల్లులు మంజూరు అవుతాయని, తమ లెక్క ప్రకారం 303 మంది లబ్ధిదారులు మాత్రమే వున్నారని హౌసింగ్ అధికారులు చెబుతున్నారు. మిగిలిన వారు (నకిలీపట్టాదారులు) సొంతంగా ఇళ్లు నిర్మించుకుంటే తమకు సంబంధం లేదని, అదంతా రెవెన్యూ శాఖ వ్యవహారమని అన్నారు.



ఎరుపు రంగు బాక్సులు ఉన్నవి అనధికారికంగా మంజూరు చేసిన ప్లాట్లు

లబ్ధిదారులను భయపెట్టి భవన నిర్మాణ సామగ్రి అమ్మకం

ప్రభుత్వం నుంచి స్థలం, ఇల్లు మంజూరైన లబ్ధిదారులకు గృహనిర్మాణ శాఖ అధికారులకు ఒక నంబరు కేటాయించారు. ఇంటి స్థలాన్ని జియో ట్యాగింగ్ చేశారు. అనంతరం లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టారు. సదరు వైసీపీ నేత వీరిని కూడా వదలలేదు. తన వెంట తిరిగే గ్యాంగ్‌ను లబ్ధిదారుల వద్దకు పంపించి, ఇళ్ల నిర్మాణానికి ... మిగతా 8వ పేజీలో



మాఘ పౌర్ణమి సముద్ర స్నానాలకు సిద్ధమైన పూడిమడక తీరం

పుణ్యస్నానాలకు సర్వం సిద్ధం

నేడు మాఘ పౌర్ణమి సందర్భంగా సముద్ర తీరాల్లో ఏర్పాట్లు

మాఘ పౌర్ణమి పుణ్యస్నానాలకు జిల్లాలోని సముద్ర తీరంలో పలుచోట్ల ఏర్పాట్లు పూర్తయ్యాయి. అచ్యుతాపురం మండలం పూడిమడక, ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం, పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం, రాంబిల్లి మండలం వాడపాలెం, తదితర ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం తీర్థమహోత్సవాలు ప్రారంభం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రాత్రికి ఇక్కడే జాగారం చేసి, తెల్లవారుజాము నుంచి సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. అనంతరం సమీపంలోని ఆలయాల్లో స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేస్తారు. పుణ్యస్నానాలు ఆచరించే ప్రదేశాల వద్ద ఆయా శాఖల అధికారులు పలు ఏర్పాట్లు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సముద్ర తీరంలో గజ ఈతగాళ్లను నియమించారు. డీఐజీ గోపీనాథ్ జెట్టి, ఎస్పీ తుహిన్ సిన్హా, డీఎస్పీలు పూడిమడకను సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. స్థానిక పోలీసులకు పలు సూచనలు చేశారు. - వివరాలు 8వ పేజీలో

హైవే నుంచి కారిడార్‌కు రోడ్డు

- నాలుగు కిలోమీటర్ల పొడవు, పది మీటర్ల వెడల్పు
- అంచనా వ్యయం రూ.28 కోట్లు
- పనులు త్వరగా చేపట్టాలని ఆర్డీవో ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న నర్సీపట్నం ఆర్డీవో వీవీవీ రమణ

నక్కపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో జాతీయ రహదారిపై కాగిత గ్రామం జంక్షన్ నుంచి విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ భూముల వరకు రూ.28 కోట్ల వ్యయంతో రహదారి నిర్మించనున్నట్టు నర్సీపట్నం ఆర్డీవో వీవీవీ రమణ చెప్పారు. ఈ రహదారి నిర్మాణ విషయమై మంగళవారం ఆయన ఆర్అండ్‌బీ ఎస్ఈ సుధాకర్, ఈఈ రమేశ్ కుమార్, డీఈ రాధాకృష్ణ, ఏఈ జ్ఞానేశ్వర్‌తో నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో సమావేశమయ్యారు. కారిడార్ రహదారి నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలని ఆర్డీవోకు సూచించారు. మొత్తం నాలుగు కిలోమీటర్ల పొడవు, పది మీటర్ల వెడల్పుతో కారిడార్‌కు రోడ్డు నిర్మాణం జరుగుతుందని ఆర్డీవో చెప్పారు.

ముగ్గురు పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్

జి.కోడూరు పంచాయతీ నిధులు దుర్వినియోగం చేసినట్టు నిర్ధారణ

- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్
- ఇప్పటికే సర్పంచ్‌పై వేటు



జి.కోడూరు సచివాలయం

మాకవరపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): **మండలంలోని జి.కోడూరు పంచాయతీ నిధులు పక్కదారి పట్టడడంతో ముగ్గురు కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీడీవో సీతామహాలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. నిధులు దుర్వినియోగానికి సంబంధించి సర్పంచ్ బొడ్డేటి అమ్మాజీ లక్ష్మిని(వైసీపీ మద్దతుదారు) మూడు నెలల పాటు పదవి నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసింది.**

జి.కోడూరు పంచాయతీలో 2021 నుంచి 2024 వరకు 14, 15 ఆర్థిక సంఘాల నిధులు సుమారు సుమారు 64 లక్షల రూపాయలు దుర్వినియోగం అయ్యాయని అదే గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మళ్ల జగన్నాథం గత ఏడాది జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై గత ఏడాది సెప్టెంబరు, అక్టోబరు, డిసెంబరు నెలల్లో అధికారులు ఇక్కడ విచారణ జరిపారు. నిధులు దుర్వినియోగం అయినట్టు నిర్ధారణ కావడంతో ఆ ఆ మేరకు జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. సర్పంచ్‌తోపాటు ఆయా సమయాల్లో కార్యదర్శులుగా పనిచేసిన ముగ్గురు ఉద్యోగులు కూడా నిధులు దుర్వినియోగానికి కారకులని తేల్చారు. దీంతో సర్పంచ్ బొడ్డేటి అమ్మాజీ లక్ష్మిని ఆ పదవి నుంచి మూడు నెలలపాటు సస్పెండ్ చేస్తూ సోమవారం ... మిగతా 8వ పేజీలో

పక్కాగా భూముల రీసర్వే

పైలట్ ప్రాజెక్టు కింద ప్రతి మండలంలో ఒక గ్రామం ఎంపిక

- 250 ఎకరాలకు ఒక బృందం చొప్పున నియామకం
- ప్రతి టీమ్‌లో ఇద్దరు సచివాలయ సర్వేయర్లు, ఒక్కో వీఆర్‌వో, వీఆర్‌ఏ
- గత ప్రభుత్వంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా చర్యలు



రైతుకు నోటీసు అందజేస్తున్న సర్వే బృందం

నర్సీపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): **భూముల సర్వే విషయంలో గత వైసీపీ హయాంలో జరిగిన పొరపాట్లు మళ్లీ జరగకుండా కూటమి ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా భూముల రీ సర్వే చేపట్టింది. ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. ప్రతి 250 ఎకరాలకు ఒక బృందాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి టీమ్‌లో సచివాలయ సర్వేయర్లు ఇద్దరు, ఒక వీఆర్‌వో, ఒక వీఆర్‌ఏ ఉంటారు. సర్వే టీమ్‌కి సపోర్ట్‌గా వీఆర్‌వో, విలేజ్ సర్వేయర్‌ని అదనంగా నియమించారు.**

నర్సీపట్నం రెవెన్యూ డివిజనల్‌లో 357 గ్రామాలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో 208 గ్రామాలలో భూముల రీసర్వే చేపట్టారు. ఇప్పుడు మిగిలిన 108 గ్రామాల్లో 20,774.63 ఎకరాలలో రీసర్వే చేయాలని అధికారులు నిర్ణయించారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రతి మండలం నుంచి ఒక గ్రామం చొప్పున పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేశారు చీడికాడ మండలంలో చీడికాడ, గొలుగొండ మండలంలో గుండుపాల, కోటవురట్ల మండలంలో చినబొడ్డేపల్లి, మాకవరపాలెం మండలంలో పైడిపాల, నర్సీపట్నం మండలంలో వేములపూడి, నాతవరం మండలంలో పీబీ అగ్రహారం, నక్కపల్లి మండలంలో గుల్లిపాడు, పాయకరావుపేట మండలంలో శ్రీరామపురం, రోలుగుంట మండలంలో రాజన్నపేట, ఎస్.రాయవరం మండలంలో క్రరివానిపాలెంతోపాటు రావికమతం, మాడుగుల మండలాల్లో ఒక్కో గ్రామం చొప్పున ఎంపిక చేసి సర్వే పనులు ప్రారంభించారు.

గత ప్రభుత్వంలో లోపాలు

గత ప్రభుత్వంలో రీసర్వే తప్పుల తడకగా సాగింది. సర్వే సిబ్బంది క్షేత్ర స్థాయిలో నిర్లక్ష్యంగా వ్యవహించారు. రైతు చూపించిన సరిహద్దులు కాకుండా ఇష్టానుసారం కొలిచారు. కొన్నిచోట్ల ఒకరి భూమిని మరొకరి పేరు మీద రాయడం, భూమి విస్తీర్ణం తగ్గించి నమోదు చేయడం ... మిగతా 8వ పేజీలో

515 కిలోల గంజాయి స్వాధీనం

- మాకవరపాలెం మండలం పైడిపాల జంక్షన్ వద్ద పట్టుకున్న పోలీసులు
- నలుగురి అరెస్టు, వాహనాలు సీజ్
- ఒడిశా నుంచి ఢిల్లీకి తరలిస్తున్నట్టు వెల్లడి



స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎస్పీ తుహిన్‌సిన్హా, పోలీసు అధికారులు

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా మీదుగా పెద్ద మొత్తంలో రవాణా అవుతున్న గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేసినట్టు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా చెప్పారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఒడిశా నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా మీదుగా అనకాపల్లి జిల్లాలోకి భారీ మొత్తంలో గంజాయి రవాణా అవుతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పలుచోట్ల వాహనాల తనిఖీ చేపట్టారు. మాకవరపాలెం పోలీసులు పైడిపాల జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా బొలెరో వాహనంతోపాటు మూడు బైక్‌లను ఆపి తనిఖీ చేశారు. 250కిపైగా గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. ఈ సందర్భంగా నర్సీపట్నం, చింతపల్లి, ఒడిశా, జి.మాడుగుల ప్రాంతాలకు నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. అనంతరం రెవెన్యూ అధికారుల సమక్షంలో తూకం వేసి 515 కిలోలు వున్నట్టు నిర్ధారించారు. ఒడిశాలోని గుర్రాల పణుకు గ్రామంలో గంజాయి కొనుగోలు చేసి ఢిల్లీకి తరలిస్తున్నట్టు నిందితులు చెప్పారు. వాహనాలతోపాటు నాలుగు మొబైల్ ఫోన్లను సీజ్ చేశారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మీడియా సమావేశంలో ఏఎస్పీలు దేవప్రసాద్, మోహనరావు, నర్సీపట్నం డీఎస్పీ పోతురెడ్డి శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నామినేషన్లన్నీ ఓకే

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ముగిసిన నామినేషన్ల పరిశీలన

- 13న మధ్యాహ్నం 3 గంటల వరకు ఉప సంహరణకు అవకాశం
- మొత్తం ఓటర్లు 22,493 మంది
- పరిశీలకుడు ఎంఎం నాయక్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్



నామినేషన్లు పరిశీలిస్తున్న అధికారులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): **ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పది మంది అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లు అధికారుల ఆమోదం పొందాయి. కలెక్టరేట్‌లో మంగళవారం నామినేషన్ల పరిశీలన ప్రక్రియ అనంతరం అభ్యర్థులందరి నామినేషన్లు సక్రమంగానే ఉన్నాయని ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.ఎన్. హరేంధర ప్రసాద్ ప్రకటించారు.**

ఎన్నికల పరిశీలకుడు ముదావత్ ఎం నాయక్ ఆధ్వర్యంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మంగళవారం ఉదయం నామినేషన్ల పరిశీలన ప్రక్రియను నిర్వహించారు. ఈ స్థానానికి మొత్తం పది మంది ... మిగతా 8వ పేజీలో

మన్యం బంద్ ప్రశాంతం

- ఏజెన్సీ వ్యాప్తంగా మూతపడిన హోటళ్లు, దుకాణాలు
- రోడ్డెక్కని ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు
- తెరుచుకోని పర్యాటక ప్రాంతాలు
- కలెక్టర్ చర్చలతో శాంతించిన ఆందోళనకారులు
- నేటి బంద్ ఉపసంహరణ



పాడేరులో నిర్మానుష్యంగా మారిన అంబేడ్కర్ కూడలి

పాడేరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మన్యం బంద్ మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు 1/70 చట్టంపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా వైసీపీ, సీపీఎం ఆధ్వర్యంలో ఏర్పడిన అఖిలపక్షం బంద్ నిర్వహించింది. ఏజెన్సీలోని అన్ని మండలాల్లో దుకాణాలు, హోటళ్లు పూర్తిగా మూతపడ్డాయి. ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ప్రైవేటు వాహనాలు సైతం తిరగలేదు. రహదారులన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి. పర్యాటక ప్రాంతాలు మూత పడడంతో పర్యాటకులు ఇబ్బంది పడ్డారు. అరకులోయలో అన్ని వ్యాపార, వాణిజ్య విద్యా సంస్థలు మూతపడ్డాయి. పర్యాటక ప్రాంతాలైన పద్మాపురం గార్డెన్స్ ట్రైబల్ మ్యూజియం, కాఫీహౌస్, చాక్లెట్ ఫ్యాక్టరీ మూసివేశారు. కాగా ఆందోళనకారులతో కలెక్టర్ దినేశ్‌కుమార్ మంగళవారం సాయంత్రం చర్చలు జరిపారు. 1/70 చట్టాన్ని ప్రభుత్వం రద్దుచేయదని హామీ ఇవ్వడంతో బుధవారం బంద్‌ను ఉపసంహరించుకున్నారు.

క్రీడల్లో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్తు

» మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు



క్రీడాకారులను అభినందిస్తున్న పప్పల చలపతిరావు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు అన్నారు. ఇటీవల నాగ్‌పూర్‌లో జరిగిన అండర్ 19, బళ్లారిలో జరిగిన సీనియర్ జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో చక్కని ప్రతిభ కనబరచిన డి.రమేష్, జి. వీర్రాజు, డి.కళ్యాణ్ రాజు, బి. ప్రసాద్‌లను మంగళవారం ఆయన నునపర్తిలో అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రీడలో రాణించి నునపర్తి క్రీడాకారులు ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించారన్నారు. కార్యక్రమంలో రెడ్డి నగేష్, గొంప నరసింహనాయుడు, పెదపూడి శంకరరావు, పల్లి వెంకటరావు, రెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థినులకు సంతూర్ ఉమెన్ స్కాలర్ షిప్



స్కాలర్‌షిప్‌కు ఎంపికైన నక్కపల్లి డిగ్రీ కళాశాల విద్యార్థినులు

నక్కపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న 22 మంది విద్యార్థినులు 2024-25 సంవత్సరం సంతూర్ ఉమెన్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివయ్య మంగళవారం చెప్పారు. ఒక్కో విద్యార్థినికి రూ.24వేలు చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమవుతాయని చెప్పారు. ఇందుకోసం పనిచేసిన అధ్యాపకులు వెంకటేశ్వరరావు, గణేశ్‌లను అభినందించారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్ శివయ్య అభినందించారు.

పైడమ్మ చెరువును గ్రామ పరిధిలోనే ఉంచాలి

» తహసీల్దార్‌కు వాడనర్సాపురం మత్స్యకారుల వినతి



తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకార నేతలు

రాంబిల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడనర్సాపురాన్ని తరలించేంతవరకు పైడమ్మ చెరువును గ్రామ పరిధిలోనే ఉంచాలని గ్రామ మాజీ సర్పంచ్ చింతకాయల ఎర్రయ్య, కోఆప్షన్ మాజీ సభ్యుడు కొవిరి రామకృష్ణ, సూరడ అప్పలరాజు, చింతకాయల పెంటయ్య తదితరులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పైడమ్మ చెరువుకు ఆనుకొని ఉన్న చిరుదుకాణాలపై ఆధారపడి పేద మత్స్యకార కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. చెరువు వద్ద ఉన్న చిరు దుకాణాలను తొలగించాలని నేవీ, రెవెన్యూ అధికారులు ఆదేశాలు జారీచేశారని, దీంతో పేద వ్యాపారులు రోడ్డున పడతారని వారు ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామాన్ని తరలించేంతవరకు పైడమ్మ చెరువు గ్రామ ఆధీనంలో ఉంటుందని అప్పటి కలెక్టర్ హామీ ఇచ్చారన్నారు. మత్స్యకార నేతలు పాల్గొన్నారు.

'గాదె'కు మద్దతుగా పీఆర్‌టీయూ ప్రచారం



ఎలమంచిలిలో ప్రచారం చేస్తున్న పీఆర్‌టీయూ నేతలు

ఎలమంచిలి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో డాక్టర్ గాదె శ్రీనివాసులు నాయుడుకు మొదటి ప్రాధాన్యతా ఓటును వేసి గెలిపించాలని కోరుతూ మంగళవారం పీఆర్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణానిధిమూర్తి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విశ్వేశ్వరావు, తెలుగు పండిట్ అసోసియేషన్ సభ్యులు మండలంలో పలు పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. అలాగే పీఆర్‌టీయూ ఉమ్మడి జిల్లా పూర్వపు అధ్యక్షులు బుద్దా విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో పట్టణంలోని జడ్పీ హైస్కూలులో గాదె శ్రీనువాసులు నాయుడుకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాల్లో సీనియర్ నాయకులు కుమార్, ఆర్‌యూపీపీ నాయకుడు రాంబాబు పాల్గొన్నారు.

నేడు శివపార్వతుల కల్యాణం

ఎలమంచిలి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మాఘ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం ఎలమంచిలి కొత్తపేటలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కల్యాణ మహోత్సవంలో భాగంగా పట్టణానికి చెందిన చార్టెడ్ అక్కౌంటెంట్ బండారు సత్య బంగారు శెట్టి దంపతులు ఇంటి నుంచి స్వామివారి ఎదురు సన్నాహ కార్యక్రమం జరుగుతుంది. బుధవారం సాయంత్రం 6 గంటలకు ఆలయ ఆవరణలో అర్చకులు మేకా వంశీశర్మ, మేకా రామ్ భగవాన్ శర్మల పర్యవేక్షణలో శివ పార్వతుల కల్యాణం జరుగుతుంది. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఆవరణలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తీర్థ ప్రసాద వితరణ చేస్తున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

కోటవురట్లలో రెండు బోర్లు ప్రారంభం



కోటవురట్లలో బోరును ప్రారంభిస్తున్న నాసా ప్రతినిధులు

కోటవురట్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కోటవురట్లలో తాగునీటి ఎద్దడి నివారణకు రెండు బోర్లను సోమవారం నాసా స్వచ్ఛందసంస్థ ప్రతినిధులు ప్రారంభించారు. ప్రభుత్వ ఆస్పత్రి లో ఒక బోరు, బీసీ కాలనీలో మరో బోరు ప్రారంభించారు. కార్యక్రమంలో వెల్స్ ఫర్ లైఫ్ డైరెక్టర్ విజర్, న్యూలైఫ్ డైరెక్టర్ రాజాకులపతి, నాసా సంస్థ ప్రతినిధులు వంతర వెంకటలక్ష్మి, గ్రామ ఉపసర్పంచ్ గవ్వా రాధాకృష్ణ, పి. గోవిందు పాల్గొన్నారు.

నేడు వాడపాలెం తీరంలో మాఘ పౌర్ణమి జాతర

వేకువజాము నుంచి తరలిరానున్న భక్తులు

పోలీస్ బందోబస్తు ఏర్పాటు : సీఐ



పుణ్య స్నానాలు ఆచరించే వాడపాలెం తీరం.. పక్కన గంగాదేవి అమ్మవారు

రాంబిల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 12వ తేదీన జరగనున్న మాఘపౌర్ణమి జాతరకు వాడపాలెం సముద్రతీరం సిద్ధమైంది. బుధవారం వేకువజాము నుంచి తీరంలో జరిగే మాఘ స్నానాలకు అన్ని రకకాల ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న వాడపాలెం తీరంలో వేలాదిమంది భక్తులు మాఘస్నానం చేయనున్నారు. అనంతరం తీరం ఒడ్డున మెట్టపై కొలువై ఉన్న గంగాదేవి అమ్మవారిని దర్శించి, పూజలు చేస్తారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు సీఐ నర్సింగరావు తెలిపారు. తీరంలో బోటులు, రోప్‌లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. గజ ఈతగాళ్లను కూడా ఏర్పాటు చేశామన్నారు. ప్రమాదకర ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. ప్రమాదకర ప్రాంతాల్లో భక్తులు స్నానాలకు వెళ్లకుండా చర్యలు తీసుకుంటున్నట్టు సీఐ తెలిపారు.

యువకుల శ్రమదానం



వాడపాలెం తీరంలో చెత్త, చెదారాన్ని ఏరుతున్న యువకులు

రాంబిల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడపాలెం సముద్ర తీరంలో బుధవారం గ్రామానికి చెందిన యువకులు పారిశుధ్య పనులు చేపట్టారు. మాఘపౌర్ణమి జాతర జరగనున్న నేపథ్యంలో సముద్రతీరం వద్ద, గంగాదేవి గుడి ఆవరణలో పేరుకు పోయిన చెత్తను, ప్లాస్టిక్ వస్తువులను తొలగించారు. తీరంలోని తుప్పలను తొలగించారు. భక్తులు ఎక్కడి పడితే అక్కడ చెత్త వేయకుండా డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు జగదీష్, సోమేష్, వెంకటేష్, శివ, సుధీర్ పాల్గొన్నారు.

తీరంలో హెచ్చరిక బోర్డులు : సీఐ



రాజయ్యపేట తీరాన్ని పరిశీలిస్తున్న సీఐ కుమారస్వామి

నక్కపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేట, బోయపాడు సముద్రతీరాల్లో మంగళవారం సీఐ కె.కుమారస్వామి పర్యటించారు. బుధవారం మాఘ పౌర్ణమి సందర్భంగా అనేక మంది సముద్రస్నానాలు చేయనున్నారు. దీనిని దృష్టిలో వుంచుకుని ఈ రెండు తీరాల్లో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. అనంతరం స్థానిక మత్స్యకార నాయకులతో మాట్లాడారు. పార్కింగ్ కోసం కూడా స్థలాలను కేటాయించామని సీఐ కుమారస్వామి చెప్పారు.

రాంబిల్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఐజీ

రాంబిల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి):స్థానిక పోలీస్ స్టేషన్‌ను మంగళవారం విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్‌జెట్టి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీంచి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ అందిన ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలకు గల కారణాలు గుర్తించి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాల గురించి అడిగి తెలుసుకున్నారు.

పోలీసులు రాత్రివేళలో గస్తీ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా, పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐ నర్సింగరావు, ఎస్ఐ నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

అంకంపేట స్వదేశీ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నిక ఏకగ్రీవం



నూతన కార్యవర్గాన్ని ప్రకటిస్తున్న ఎన్నికల అధికారిణి టి.నాగమణి

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అంకంపేట స్వదేశీ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు మంగళవారం ఏకగ్రీవంగా జరిగాయి. గ్రామ పెద్దల సమక్షంలో ఎన్నికల అధికారిణి టి.నాగమణి సంఘానికి ఎన్నికలు నిర్వహించారు. సంఘం అధ్యక్షులుగా పిట్ల అప్పారావు, ఉపాధ్యక్షునిగా దడాల మురళీకృష్ణ, ఏడుగురు డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సహాయకులుగా వీఎఫ్‌ఓలు జె.పూర్ణిమ, పీఎస్‌వై.లహరి తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయానికి హుండీ వితరణ

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోకులపాడులోని అభయాంజనేయస్వామి ఆలయానికి జనసేన పార్టీ నాయకుడు మత్తి కార్తీక్ నూతన హుండీని మంగళవారం వితరణగా అందజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల నేత సేనాపతి బాబూరావు, ఎం. బాబ్జీ, బి. రమణ, నాని, రమణబాబు, నక్కా శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం



మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం

పాయకరావుపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. మంగళవారం పట్టణంలో జరిగిన మండల పాస్టర్స్ ఫెలోషిప్ సర్వసభ్య సమావేశంలో సంఘం సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు ఎన్నికల కమిటీ ఛైర్మన్లు ఓబయ్య, జాన్ డేవిడ్ ప్రకటించారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా ఎస్.జార్జి, అధ్యక్ష, కార్యదర్శులుగా పి.శామ్యూల్, జాన్ కాల్విన్, కోశాధికారిగా డి.సువార్తరాజు ఎన్నికయ్యారన్నారు. సంఘం ఉపాధ్యక్షునిగా అనిల్‌కుమార్, కమ్యూనికేషన్ సెక్రటరీలుగా విల్సన్, బి.సత్యకుమార్, జాయింట్ ట్రెజరర్‌గా జి.జోష్, కార్యవర్గ సభ్యులుగా పి.ఇస్సాకు, జి.రత్నంమోజెస్, ముఖ్యసలహాదారులుగా ఎం.దానియేలు, ఆశీర్వాదం, సలహాదారులుగా జాన్ డేవిడ్, ఓబద్య, జె.చార్లెస్‌ఫిన్నీ, యేసురత్నం, రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు.

రఘువర్మకు మద్దతుగా ప్రచారం



పీకేపల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

కోటవురట్ల, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు మద్దతుగా ఏపీటీఎఫ్ మండల ప్రతినిధులు మంగళవారం ప్రచారం చేశారు. పాములవాక, బోడపాలెం, పీకేపల్లి రామన్నపాలెం గ్రామాల్లో ఉపాధ్యాయుల ఇంటింటికి వెళ్లి రఘువర్మను గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో ఏపీటీఎఫ్ ప్రతినిధులు ఈ. రమణ, సత్యాడ దాసు, మద్దిల కృష్ణప్రసాద్, సంగీతరాజ్, రాజు పాల్గొన్నారు.

చినకవలాపల్లిలో ఘనంగా సీతారాముల తీర్థం

రాంబిల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినకవలాపల్లిలో మంగళవారం సీతారాముల తీర్థాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానికులే కాకుండా సమీప గ్రామాలకు చెందిన భక్తులు సీతారాములను దర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, యువకులు ముగ్గుల పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. మహిళల చిడతల భజనలు ఆకట్టుకున్నాయి.

సస్యరక్షణతో పంటల అధిక దిగుబడి : ఏవో



అపరాల పంటపై రైతులకు సూచనలిస్తున్న ఏవో ఆదినారాయణ

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : అపరాల పంటలో సస్యరక్షణతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ తెలిపారు. మంగళవారం మండలంలో గోపాలపట్నం, మంగవరం గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన అపరాలపై వచ్చే తెగుళ్ల నివారకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మందుల వాడకం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయా గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఎన్‌పీఎస్ఎస్ యాప్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ ఆర్.సాధన, ఎపీఈఓ సతీష్, రైతులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీపై అవగాహన



ఫార్మర్ రిజిస్ట్రీ అవగాహన కల్పిస్తున్న ఏవో ఉమా ప్రసాద్

నక్కపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులు లబ్ధి పొందాలంటే తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఉమాప్రసాద్ సూచించారు. మంగళవారం ఫార్మర్ రిజిస్ట్రీపై ఉద్దండపురం, గుల్లిపాడు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. మండలంలో 12,750 మంది పీఎం కిసాన్ లబ్ధిదారులున్నారని, ఇప్పటి వరకూ 18 విడతలు అందాయన్నారు. 19వ విడత పీఎం కిసాన్ ద్వారా లబ్ధి పొందాలంటే కచ్చితంగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల్లో ఫార్మరీ రిజిస్ట్రీ ప్రక్రియను ఆయన పరిశీలించారు. సకాలంలో రైతుల ఫార్మరీ రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు.

బాబోయ్ కుక్కలు

» వీధుల్లో పదుల సంఖ్యలో సంచారం

» రోడ్డుపై ఒంటరిగా కనిపిస్తే దాడులు



పాయకరావుపేట పార్కు వీధిలో సంచరిస్తున్న కుక్కలు

పాయకరావుపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : పాయకరావుపేటలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తుండడంతో ప్రజలు భయపడిపోతున్నారు. రాత్రి, పగలు రోడ్లపై తిష్టవేస్తున్న కుక్కలు.. ఒంటరిగా వచ్చేవారిపై దాడిచేసి గాయపరుస్తున్నాయి. గత కొన్నేళ్లుగా కుక్కల నియంత్రణపై పంచాయతీలు కనీసం దృష్టిపెట్టకపోవడంతో పట్టణంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో వాటి సంఖ్య పెరిగిపోయాయి. రాత్రి పది దాటితే వీధుల్లో ఒంటరిగా నడిచి వేళ్లేందుకు ప్రజలు భయపడుతున్నారు. గ్రామాల్లో కోళ్లు కనబడితే కుక్కలు దాడిచేసి చంపేస్తుండడంతో ప్రజలు వాటి పెంపకాన్ని మానుకున్నారు. రాత్రి వేళల్లో కుక్కలు వాహనాలపై రాకపోకలు సాగించేవారిపై దాడులు చేస్తుండడంతో ప్రమాదాలు జరిగి గాయాలపాలవుతున్నారు. గత కొంత కాలంగా కుక్కల దాడిలో పలువురు చిన్నారులతోపాటు పదుల సంఖ్యలో మహిళలు, వృద్ధులు గాయపడిన సంఘటనలు విదితమే. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెరిగిపోయిన వీధి కుక్కల నియంత్రణకు పంచాయతీలు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

'పేట' ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలు



రైల్వే ఓవర్ బ్రిడ్జి కింద సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న సీఐ అప్పన్న

పాయకరావుపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు సీఐ జి.అప్పన్న తెలిపారు. మంగళవారం పట్టణంలోని తాండవ జంక్షన్, రైల్వే ఓవర్ బ్రిడ్జి, కనోసా స్కూల్, వై. జంక్షన్, పీఎల్.పురం, సీతారాంపురం, నామవరం తదితర జంక్షన్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సహకారంతో నియోజకవర్గానికి 100 సీసీ కెమెరాలు సమకూరగా వీటిలో పాయకరావుపేట మండలానికి 30 సీసీ కెమెరాలు కేటాయించారన్నారు. వీటిలో పట్టణంలో ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.

నునపర్తిలో ఘనంగా నల్లమారెమ్మ సంబరం



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సుందరపు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నునపర్తిలో నల్లమారెమ్మ పండగ మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా మంచినీరు, మజ్జిగ, పులిహోరాను నిర్వాహకులు పంపిణీ చేశారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, బీజేపీ ఎలమంచిలి నియోజకవర్గ కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు, సర్పంచ్ చుక్కా అనూరాధ, టీడీపీ సీనియర్ నాయకుడు రెడ్డి నగేష్, గొంప నరసింహ నాయుడు, బైలపూడి శ్రీరామదాసు, జనపరెడ్డి శ్రీనివాసరావు, డ్రీమ్స్ నాయుడు, రెడ్డి శ్రీను, వెన్నెల అప్పలనాయుడు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరు గ్రామాలకు బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె. రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల కింద చెట్లకొమ్మలనరికివేతతో వెదురువాడ, జి.ధర్మవరం, లంక ధర్మవరం, మెట్ట ధర్మవరం, మోసయ్యపేట, అచ్యుతాపురంలోని ఇందిరమ్మ కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు.

ధ్యానంతో ఒత్తిడిని జయించవచ్చు

» గిజా పిరమిడ్ ఫౌండర్ సరిసా లీలా ప్రసన్నకుమారి



ధ్యానంపై ప్రసంగిస్తున్న ప్రసన్నకుమారి

మునగపాక, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి ఒత్తిడినయినా జయించే శక్తి ధ్యానానికి ఉంటుందని గిజా పిరమిడ్ కేంద్రం ఫౌండర్ సరిసా లీలా ప్రసన్న కుమారి అన్నారు. స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఫంక్షన్ హాలులో మంగళవారం పత్రీజీ ధ్యాన మహాచక్రం-5పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధ్యానం జీవిత ప్రయాణానికి సుఖమార్గమన్నారు. ఈ సదస్సులో లలిత, ధ్యాన సభ్యులు పాల్గొన్నారు.

పట్టణంలో ఘంటసాల వర్ధంతి



ఘంటసాల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎలమంచిలి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం గానగంధర్వుడు ఘంటసాల వేంకటేశ్వరరావు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఘంటసాల చిత్రపటానికి ఎంపీపీ బోదెపు గోవింద్‌తోపాటు ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆడారి పూరి జగన్నాథం, పెన్షనర్స్ సంఘాధ్యక్షుడు సీహెచ్. సోమేశ్వరరావు, బీఎస్.బంగారు శెట్టి, వాకర్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు మడగల సత్యనారాయణ, విశ్రాంత ఉపాధ్యాయుడు వనుం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

నక్కపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక దుర్గాభవానీ ఆలయ పదో వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల తాకిడితో ఆలయం కిటకిటలాడింది. తొలుత అర్చకులు వెలవలపల్లి మహేశ్ అమ్మవారికి అష్టోత్తర శతనామార్చన, కుంకుమపూజలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త కొప్పిశెట్టి వెంకట రమణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. నక్కపల్లికి చెందిన సామాజిక సేవా కార్యకర్త ఎస్ఎస్ శర్మను ఆలయ కమిటీ తరఫున గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు.

స్టేషన్‌లో మగ్గిపోతున్న పందెం కోళ్లు


పోలీసు స్టేషన్‌లో ఉన్న పందెం కోళ్లు

మాకవరపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మాకవరపాలెం పోలీసు స్టేషనులో పందెం కోళ్లకు సరైన దాణా, నీరు లేక మగ్గిపోతున్నాయి. మండలంలో శెట్టిపాలెంలో పది రోజుల క్రితం కోడి పందేలపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఎనిమిది కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నారు. అయితే ఇవి పందెం యజమానుల వద్ద తిండికి ఇబ్బంది లేక ఉండేవి. ఇప్పుడు పోలీసులకు చిక్కిపోవడంతో ఎనిమిది రోజులుగా స్టేషన్‌లో శిక్ష అనుభవిస్తున్నాయి. కేసు విచారణ ఎప్పుడు ముగుస్తుందో, వీటికి ఎప్పుడు మోక్షం లభిస్తుందో తెలియని దుస్థితి.

ఘనంగా తలుపులమ్మ పండుగ


తలుపులమ్మను దర్శించుకునేందుకు క్యూలో బారులు తీరిన భక్తులు


ఏటిగైరంపేటలో పలు వేషధారణలు

గొలుగొండ ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం తలుపులమ్మ అమ్మవారి పండుగను ఘనంగా నిర్వహించారు. ఏటిగైరంపేట, గుండుపాల, పుత్తడిగైరంపేట తదితర గ్రామాల్లో అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే ఆయా గ్రామాల్లో రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే ఏటిగైరంపేట గ్రామంలో తలుపులమ్మ పండుగ సందర్భంగా పలు కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ ఉత్సవాలు టీడీపీ నేత నల్లబెల్లి రాజబాబు, నల్లబెల్లి స్వామి, సర్పంచ్ రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు కాంతం ఆధ్వర్యంలో చేపట్టారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

ఐసీడీఎస్ పీవో శ్రీగౌరి


సదస్సులో మాట్లాడుతున్న పీవో శ్రీగౌరి

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అవగాహనతో క్యాన్సర్‌ను నిరోధించవచ్చునని గొలుగొండ సీడీపీవో శ్రీగౌరీ అన్నారు. మంగళవారం ఏఎల్‌పురంలో వ్యాధిపై కళాశాల విద్యార్థులు, డ్వాక్రా మహిళలకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో శ్రీగౌరీ, వెలుగు ఏపీఎం కరుణాకర్ మాట్లాడుతూ అనేక రకాలైన క్యాన్సర్‌లు ఉంటాయన్నారు. లక్షణాలను గుర్తించి వైద్యసేవలు పొందితే వ్యాధిని నిరోధించవచ్చున్నారు. ఆలస్యం చేస్తే ప్రాణాలకు హాని తప్పదని హెచ్చరించారు. పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ సత్యశ్రీ, వెలుగు, అంగన్‌వాడీ సిబ్బంది కిరణ్, రామారావు,రమణ, మంగ, ధనలక్ష్మి, భవాని, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టమాటా ధర నేల చూపులు

- కిలో రూ.5 పలకడంతో రైతుల గగ్గోలు
- ఖర్చులు కూడా రాలేదని ఆవేదన


మాకవరపాలెం వారపు సంతకు దండిగా వచ్చిన టమాటా



మాకవరపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): టమాటా ధర నేల చూపులు చూసింది. రోజురోజుకూ ధర పడిపోతుండడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. మాకవరపాలెం మండల కేంద్రంలో మంగళవారం జరిగిన వారపు సంతలో టమాటా క్రేట్ (30 కిలోలు) టమాటాలు రూ.120 నుంచి రూ.150 మాత్రమే ధర పలికింది. అంటే కిలో టమాటా రూ.5 రూపాయల మాత్రమే రైతుకు దక్కింది.

మండలంలోని పాపయ్యపాలెం, తూటిపాల, బూరుగుపాలెం, మామడిపాలెం, లచ్చన్నపాలెం, జి.వెంకటాపురం, జి.కోడూరు,, దర్శవరం గ్రామాల్లో టమాటా పంట సాగు చేస్తున్నారు. ఇటీవల క్రేట్ రూ.300 అమ్మకాలు జరిగాయి. ఒక్కసారిగా కిలో టమాటా రూ.5 ధర పడిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పండించిన టమాటా కోసి సంతకు తీసుకువచ్చేందుకు అవుతున్న ఖర్చు కూడా రావడం లేదని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టమాటా ధర మరింత పతనం కావడంతో ఏం చేయాలో అర్థం కావడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. పంటలు పండిస్తే మరింత లాభాలు వస్తాయని కరగాయల పంటలు వేశామని, అవి కూడా చివరకు ధరలు లేక తీవ్రంగా నష్టపోవాల్సి వస్తున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కూరగాయల సాగు రైతులను ఆదుకోవాలని వారు వేడుకున్నారు.

హామీలు అమలు చేయకపోతే మళ్లీ ఆందోళన


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు పాత్రుడు

మాకవరపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పయనీర్ యాజమాన్యం ఇచ్చిన హామీల అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే మళ్లీ ఆందోళన తప్పదని టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు హెచ్చరించారు.మంగళవారం తామరం ప్రభాకర్ రాజు ఇంటి వద్ద కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భీమబోయినపాలెం వద్ద ఇటీవల నాలుగు రోజులుపాటు లారీలను అడ్డుకున్నామన్నారు. ఈ సమయంలో పయనీర్ కంపెనీ 15 డిమాండ్లపై స్పష్టత ఇచ్చిందన్నారు. ఇందులో భాగంగా వెంకన్నపాలెం నుంచి రామన్నపాలెం సెంటర్ వరకు రోడ్డు పనులు చివరిదశకు చేరుకున్నాయన్నారు. ప్రధానంగా నిర్వాసితుల సమస్యలపై యాజమాన్యం చర్యలు తీసుకోవాలన్నారు. స్థానికులకు ఉద్యోగాలు, రహదారులపై సీసీ కెమెరాలు, భూములు కోల్పోయిన గ్రామాల్లో వైద్య సేవలు, ఆర్‌వోఆర్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలన్నారు. నాయకులు అల్లు రాము నాయుడు, రుత్తల నందకిశోర్, దుంగలరమణ, జోగిపాత్రుడు, యర్రంశెట్టి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఐదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నర్సీపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంత్సరం ప్రవేశాలకు వచ్చే నెల 6వ తేదీలోగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎ.రాజేశ్వరి తెలిపారు. తెల్లరేషన్ కార్డు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులుగా పేర్కొన్నారు. ఐదో తరగతిలో ప్రవేశాలకు ఏప్రిల్ 4న ఉదయం 10 నుంచి 12 గంటలు, ఇంటర్ ప్రవేశాలకు అదే రోజు మధ్యాహ్నం 2 నుంచి 4.30 వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు.

12న జిల్లా స్థాయి గుర్రాల పోటీలు

నాతవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంపేటలో ఈ నెల 12వ తేదీన మహలక్ష్మీ అమ్మవారి జాతరను పురస్కరించుకుని జిల్లా స్థాయి గుర్రాల పోటీలను నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యుడు దొర తెలిపారు. ఉత్సవం రోజు వెన్నెల ఈవెంట్స్, కాంతర డ్యాన్స్ తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పరిసర గ్రామాల భక్తులకు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదాలపై జాగ్రత్తలు తీసుకోవాలి

- జిల్లా రవాణా శాఖాధికారి మనోహర్

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు రహదారిపై ప్రయాణం సాగించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా రవాణా శాఖాధికారి (ఆర్టీవో) మనోహర్ సూచించారు. రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా మంగళవారం డైట్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన రహదారి భద్రతా అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ వేసుకోవాలని, కారు ప్రయాణంలో సీటు బెల్ట్ ధరించాలని తెఇపారు. రోడ్డు ప్రమాదాల్లో యువత ఎక్కువ మంది చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల విద్యార్థులు ప్రయాణం సాగించేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పి.గోపీకృష్ణ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు, భద్రతా నియమాలు పాటించడం వల్ల ప్రమాదాలను నియంత్రించవచ్చన్నారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ ది ఎబిలిటీ పీపుల్ సంస్థ వెన్నుపూసలో గాయపడిన శారీరక దివ్యాంగులకు, ఎముకల సమస్యలు ఉన్న వారికి చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ దిలీప్ పాత్రోకు అభినందనలు తెలుపుతూ సంస్థకు రూ.లక్ష విరాళంగా అందచేస్తున్నట్టు ప్రకటించారు. రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా విద్యార్థులతో రవాణా శాఖ అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సదస్సులో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, ఎంవీఐ ఎ.గీతాకావ్య, ట్రాఫిక్ సీఐ ఎం.వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

లక్ష్యానికి చేరువగా ధాన్యం కొనుగోళ్లు

-చిరంజీవి, వ్యవసాయాధికారి



మండలంలో 600 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. ఇప్పటికే 560 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశాం. ఇంకా ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకుంటాం. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ధాన్యం డబ్బులు 24 గంటల్లో రైతుల ఖాతాలకు జమ అవుతున్నాయి.

ప్రశ్న: ఈ ఏడాది ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం ఎంత నిర్ధారించారు?

జవాబు: మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా 600 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేశాం. ఇప్పటికే సుమారు 560 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశాం. గత ఏడాది 450 మెట్రిక్ టన్నులు ధాన్యం మాత్రమే కొనుగోలు చేయగలిగాం. ఈ ఏడాది ఇంకా ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకుంటాం.

ప్ర: రైతులకు గిట్టుబాటు ధర అందుతున్నదా?

జ: ఈ ఏడాది ఖరీఫ్‌లో 4,100 హెక్టార్లలో రైతులు వరి సాగు చేశారు. అధిక సంఖ్యలో రైతులు ఈ ఏడాది ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అమ్మకం చేశారు. ధాన్యం వంద కిలోల బస్తా రూ.2,300 నుంచి రూ.2,330 వరకు ధర వచ్చింది. అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు విక్రయించుకునేలా గ్రామాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నాం.

ప్ర: ధాన్యం కొనుగోలు నగదు రైతులకు ఎన్ని రోజుల్లో జమ అవుతుంది?

జ: ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ధాన్యం డబ్బులు 24 గంటల్లో రైతుల ఖాతాలకు చేరాయి. డబ్బులు జమచేసేటప్పుడు రైతులు ఇబ్బందుపడలేదు. అలాగే ధాన్యం సచివాలయాలకు తరలించేందుకు ప్రభుత్వం సులభ పద్ధతి ఏర్పాటు చేసింది. రైతుకు ఎటువంటి కష్టం లేకుండా ప్రభుత్వానికి ధాన్యం విక్రయించారు.

ప్ర: రబీలో అపరాల విత్తనాలు ఎంత రాయితీకి ఇచ్చారు?

జ: ఈ ఏడాది 40 రాయితీతో విత్తనాలు పంపిణీ చేశాం.

-మాకవరపాలెం, ఆంధ్రజ్యోతి

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో


దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రవికుమార్

దేవరాపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పి.రవికుమార్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించిన అనంతరం గర్భిణులకు అందుతున్న సేవలు, ప్రసవాలు గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. హాస్పటల్‌కు వచ్చిన రోగులకు మెరుగైన సేవలు అందించాలని వైద్యాధికారి మేఘనను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వికలాంగుల పెన్షన్ల పరిశీలన జరుగుతుందన్నారు. వైద్య సిబ్బంది సత్యమూర్తి, పుష్పరాజు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ వద్ద మరుగుదొడ్లకు మరమ్మతులు


మరుగుదొడ్ల పనులు చేస్తున్న దృశ్యం

మాడుగుల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్ షెల్టర్‌కి ఆనుకొని ఉన్న మరుగుదొడ్లకు మరమ్మతులను పంచాయతీ చేపట్టింది. మరుగుదొడ్లు అధ్వానంగా ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పంచాయతీ సర్పంచ్ యడ్ల కళావతి నిరుపయోగంగా మారిన ప్రజా మరుగుదొడ్లను పంచాయతీ నిధులతో మరమ్మతులు చేయిస్తున్నారు. మరుగుదొడ్లను పాడు చేయకుండా చుట్టూ ఇనుప గేట్లను ఏర్పాటు చేశారు. ఇకపై ప్రయాణికులు, ప్రజలు అత్యవసర సమయాల్లో మరుగుదొడ్లు ఉపయోగించుకునే విధంగా పంచాయతీ చర్యలు తీసుకోవడం పట్ల స్థానికులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హాస్టళ్లను తనిఖీ చేసిన మండల విద్యాశాఖాధికారులు


చీడికాడ బాలికల హాస్టల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో బొంజుబాబు

చీడికాడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): చీడికాడ హాస్టల్‌ను ఆదివారం రాత్రి డీఈవో అప్పారావు నాయుడు తనిఖీ చేయడంతో మండల విద్యా శాఖ అధికారులు అప్రమత్తం అయ్యారు. సోమవారం రాత్రి మండల విద్యా శాఖ అధికారులు వసతిగృహాలను సందర్శించారు. సోమవారం రాత్రి 7.30 గంటలకు ఎంఈవో కె.బొంజుబాబు చీడికాడ బాలికల హాస్టల్‌కి వెళ్లి బాలికలతో సమావేశమై పది పరీక్షల గురించి వివరించారు. రెండో ఎంఈవో బీవీ.రమణ సోమవారం రాత్రి 9గంటలకు తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. పది పరీక్షలు పూర్తయ్యేవరకూ సెలవులతో సంబంధం లేకుండా రాత్రి 10గంటల వరకూ తప్పక చదవాలని సూచించారు.

కొత్తకోటలో వాహన తనిఖీలు

రావికమతం,ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కొత్తకోటలో పోలీసులు మంగళవారం ముమ్మరంగా వాహన తనిఖీలు చేట్టారు. బీఎన్ రోడ్డులో కొత్తకోట వద్ద వాహనాలను ఆపి ట్రాఫిక్ చలానాలు కట్టని వాహనదారులను దగ్గరుండి నెట్ సెంటర్‌లో అపరాధ రుసుం కట్టించారు. కట్టని వారి వాహనాలను సీజ్ చేసి, చలానా కట్టిన తరువాత రిలీజ్ చేస్తామని పోలీసులు తెలిపారు. నిబంధనలు పాటించని వాహనదారులపై కేసులు నమోదు చేస్తున్నామని వారు చెప్పారు.

చెరకు రైతులకు మద్దతుగా ఆందోళనకు సిద్ధం

- జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రాజు


చెరకు రైతులతో మాట్లాడుతున్న రాజు

చోడవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గోవాడ చెరకు రైతుల సమస్యలకు అధికార యంత్రాంగం పరిష్కారం చూపని పక్షంలో నిరాహార దీక్షలకు సిద్ధంగా ఉన్నామని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు ప్రకటించారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీని ఆదివారం సందర్శించిన ఆయన చెరకు రైతులతో మాట్లాడుతూ, ఫ్యాక్టరీలో క్రషింగ్ సజావుగా సాగకపోవడంతో రోజుల తరబడి ఫ్యాక్టరీ వద్ద రైతులు పడిగాపులు పడుతున్నారన్నారు. సకాలంలో పర్మిట్లు ఇవ్వకపోవడంపై రైతులు అసంతృప్తితో ఉన్నారని, ఇకపై ఫ్యాక్టరీకి వచ్చిన సరకును సకాలంలో క్రషింగ్ చేయాలన్నారు. రైతాంగం ఎదురుర్కొంటున్న ఈ సమస్యలపై ఫ్యాక్టరీ ఎండీ, ఇతర ఉన్నతాధికారులు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు ఇబ్బంది కలగకుండా సకాలంలో చెరకు పర్మిట్లు ఇవ్వడంతోపాటు, ఫ్యాక్టరీ క్రషింగ్ సజావుగా సాగేలా యాజమాన్యం స్పందించాలని, లేనిపక్షంలో ఈనెల 16న గోవాడ వద్ద నిరాహార దీక్షకు జనసేన శ్రేణులు సిద్ధంగా ఉన్నారని పీవీఎస్ఎన్ రాజు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అల్లం రామప్పారావు, గూనూరు మూలినాయుడు, కర్రి రమేష్, బలిజ మహరాజు, ఆడారి నాయుడు, మంగా శ్రీను, పీలా మహేష్, దాడి అప్పారావు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు కావాలి

- జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు



మేడిచెర్ల రైతులతో మాట్లాడుతున్న మోహన్‌రావు

కె.కోటపాడు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూములు కలిగిన ప్రతి ఒక్కరూ ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బి. మోహన్‌రావు తెలిపారు. మంగళవారం మేడిచెర్లలో రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీపై అవగాహన కలిగించారు. ఆధార్ తరహాలో ప్రత్యేక నంబర్ ప్రతి రైతుకు అందించడం జరుగుతుందన్నారు. పీఎం కిసాన్ ఆర్థిక సాయం అందాలంటే ఫార్మర్ రిజిస్టర్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. ఇప్పటివరకు మండలంలో 500 మంది రైతులు నమోదు చేయించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏవో సోమశేఖర్, ఏఈఓలు లైలా, ప్రియాంక, వీఏఏలు, హరీష్ దొర, సుధీర్, రైతులు పాల్గొన్నారు.

రోలుగుంటలో..

మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం చురుగ్గా చేపడుతున్నారు. దీనిలో భాగంగా మంగళవారం కొమరవోలు ఆర్ఎస్‌కే కేంద్రంలో వ్యవసాయ శాఖ అసిస్టెంట్ నవ్య ఆధ్వర్యంలో ఫార్మర్ రిజిస్ట్రీ చేపట్టారు. 80 మంది రైతులకు రిజిస్ట్రీ చేసినట్లు తెలిపారు.

చీడిపల్లిలో గిరినాగు పట్టివేత


చీడిపల్లిలో పట్టుకున్న గిరినాగు

చీడికాడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో చీడిపల్లి గ్రామంలో డోకల సన్నిబాబు ఇంటిలో 15 అడుగుల గిరినాగు హల్‌చల్ చేసింది. సోమవారం సాయంత్రం ఇంటిలోకి పాము ప్రవేశించి బుసకొడుతుండడంతో కుటుంబ సభ్యులు ఇంటి నుంచి బయటకు పరుగులు తీశారు. వెంటనే గ్రామ యువత అటవీ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు చాకచక్యంగా పట్టుకొని అటవీప్రాంతంలో వదిలివేశారు.

ఎం.కోడూరు మోదకొండమ్మకి వెండి సింహాల వితరణ

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కోడూరు మోదకొండమ్మకు దాతలు కిలోన్నర వెండి సింహాలను జాలంపల్లికి చెందిన అనుదీప్, శ్రీలత దంపతులు, దిలీప్, నాగేషు కుమారి దంపతులు, పోతిన వెంకటరమణ,త్రివేణి దంపతులు కుమార్తెలు లక్ష్మీప్రసన్న, సౌజన్యలతోపాటు కొప్పుశెట్టి రాజ్‌కుమార్, లక్ష్మి దంపతులు అందజేశారు.

మాడుగుల, ఘాటీరోడ్డు జంక్షన్‌లో సీసీ కెమెరాలు


మాడుగులలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

మాడుగుల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మాడుగుల, ఘాటీ రోడ్డు జంక్షన్‌లో పోలీసులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మాడుగులతోపాటు ఘాటీరోడ్డు జంక్షన్‌లో గతంలో అమర్చిన సీసీ కెమెరాలు మరమ్మతులకు గురికావడంతో పోలీస్ నిఘాకు అంతరాయం ఏర్పడింది. ఎస్ఐ గొర్లి నారాయణరావు మాడుగులలో ఐదు సీసీ కెమెరాలను బస్టాండ్, మద్యం దుకాణాల పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. అలాగే ఘాటీరోడ్డు కూడలిలో నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ద్వారా ప్రజా కదలిక, ఆకతాయిల కదలికలను పరిశీలిస్తామని ఎస్ఐ నారాయణరావు తెలిపారు. వేసవిలో దొంగతనాలను దృష్టిలో పెట్టుకొని ముందస్తుగా వీటిని ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు.

ఘనంగా కేశవస్వామి కల్యాణ వేడుకలు



కేశవస్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

చోడవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేశవస్వామి కల్యాణ వేడుకల్లో భాగంగా మంగళవారం సుప్రభాత కైంకర్యం, తోమాలసేవ, యజుర్వేద పారాయణం కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో విశేష ఆరాధన, సాయంత్రం వేదపారాయణ, నిత్యహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అర్చకులు సుదర్శన సీతారామాచార్యులు, రామ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తమండలి సభ్యులు, ఉపాధ్యాయుల శ్రీనివాసరావు, ఉప్పల బాబు, యూనియన్ బ్యాంకు రాము తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఢిల్లీలో ఎల్‌ఐసీ ఏజెంట్ల ధర్నా

చోడవరం, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): జీవిత బీమా ఏజెంట్ల సమస్యల పరిష్కారం విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా మంగళవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా ఎల్ ఐసీ ఏజెంట్లు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ఆందోళనలో ఎల్‌ఐసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం. నాగరాజు ఆధ్వర్యంలో స్థానిక ఎల్‌ఐసీ బ్రాంచి ఏజెంట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్‌ఐసీ చోడవ రం బ్రాంచి ఏజెంట్ల సంఘం అధ్యక్షుడు మోహన్ మాట్లాడుతూ, బీమా ప్రీమియంపై జీఎస్‌టీ ఎత్తివేయాలని, పాలసీదారులకు బోనస్ పెంచాలని, ఏజెంట్ల మీద విధించిన క్లాబాక్ నిబంధన ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో కార్యదర్శి శంకరరావు, రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా గ్రామ దేవతల పండగలు


పరదేశమ్మతల్లికి పూజలు చేస్తున్న భక్తులు

రావికమతం, ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండు గ్రామాలలో మంగళవారం గ్రామ దేవతల పండగలు ఘనంగా నిర్వహించారు. రావికమతంలో పరదేశమ్మ పండగను గ్రామస్థులు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. భక్తులు పూజలు చేసి, మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి శతకంపట్టు వద్ద, గ్రామంలోనూ విద్యుత్ అలంకరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా గొంపలో పైడితల్లమ్మ పండగను ఆ గ్రామస్థులు వైభోపేతంగా నిర్వహించారు.

80 గిరిజన కుటుంబాలకు దుస్తుల పంపిణీ

చీడికాడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి భారత్ వికాస్ పరిషత్ ఆధ్వ ర్యంలో గొడుగుమామిడి, చెరుకుపల్లిల్లో 80 కుటుంబాలకు మంగళవారం దుస్తు లు పంపిణీ చేశారు. వనవాసి కళ్యాణ యోజన పథకం కింద దుప్పట్లు, చీరలు, లుంగీలు, రూ.70వేలు విలువ చేసే దుస్తులు పంపిణీ చేశారు. ఎస్ఐ బి.సతీష్, సర్పంచ్ ఈశ్వరమ్మ, సంస్థ సభ్యులు వర్మ, గోపారావు, నిర్మల, శివకుమార్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అర్జునగిరిలో సత్యనారాయణ స్వామి వ్రతాలు

చీడికాడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో అర్జున గిరిలో స్వయంభూ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళ వారం అర్చకులు పానంగపల్లి శ్రీనివా సాచార్యులు సత్యనా రాయణస్వామి వ్రతా లు నిర్వహించారు. కళ్యాణ మహోత్స వాల్లో భాగంగా మంగళవారం జరిగిన ఈ వ్రతాల్లో సర్పంచ్ బి.రమాదేవి, మహిళలు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న ఉమామహేశ్వరీ తీర్థం

దేవరాపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలో నాలుగు రోజుల నుంచి జరుగుతున్న తీర్థం బుధవారంతో ముగియనున్నది. చివరి రోజు ఎడ్ల పరుగు ప్రదర్శనలు, పుర వీధుల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రధాన వీధుల్లో విద్యుత్ అలంకరణ చేశారు.


పాడేరులో బంద్‌కు మద్దతు తెలుపుతున్న ఎంపీ మాధవి, జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, తదితరులు



రోడ్డుపైకి వచ్చిన ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, ఎమ్మెల్సీ రవిబాబు, సీపీఎం, సీపీఐ నేతలు

మన్యం బంద్ ప్రశాంతం

- అయ్యన్న వ్యాఖ్యలకు వ్యతిరేకంగా అఖిలపక్షం నిరసన
- మూతపడిన దుకాణాలు, హోటళ్లు
- రోడ్డెక్కని ఆర్టీసీ, ప్రైవేట్ వాహనాలు

పాడేరురూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల హక్కుల చట్టం 1/70ని సవరించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా అఖిలపక్ష ప్రజాసంఘాలు మంగళవారం చేపట్టిన మన్యం బంద్ పాడేరులో ప్రశాంతంగా జరిగింది. అఖిల పక్ష, ప్రజా సంఘాల నాయకులు ఉదయం 5 గంటలకే ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దకు చేరుకొని బస్సులను బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. పాడేరు ఘాట్‌రోడ్డులోని వంతాడపల్లి చెక్‌పోస్టు వద్ద, ఘాట్‌లోని 12వ మైళ్ల రాయి గ్రామం వద్ద, చింతపల్లి రహదారిలో పి.గొందూరు, కాన్వెంట్ జంక్షన్ వద్దకు చేరుకుని నాయకులు బైఠాయించారు. వ్యాపారులు దుకాణాలను మూసి బంద్‌కు సహకరించారు. జీపు, ఆటో యూనియన్ నాయకులు, యజమానులు వాహనాలను నడపలేదు. ఆర్టీసీ బస్సులు డిపోకే పరిమితమయ్యాయి. అఖిలపక్ష నాయకులు ప్ర ధాన కూడలిలో వాహన రాకపోకలను అడ్డుకున్నారు. డీఎస్పీ షేక్ షాబాద్ అహ్మద్, సీఐ డి.దీనబంద్ వచ్చి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా వారిని పంపించారు. బంద్ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మాజీ జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతీరాణి, అరకు మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి తదితరులు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దకు చేరుకొని మద్దతు తెలిపారు. సాయంత్రం 5 నుంచి బస్సులు యథావిధిగా నడిచాయి. ఈ కార్యక్రమంలో అఖిల పక్ష, ప్రజా సంఘాల నాయకులు స్థానిక ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వరరాజు, కుంబా రవిబాబు, పి.అప్పలనర్స, కిల్లో సురేంద్ర, పొట్టిక సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అరకులోయలో..

అరకులోయ, ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి): భూబదలాయింపు చట్టం సవరణచేస్తే ఊరుకునేది లేదని గిరిజన సంఘాలు,ప్రజా సంఘాల నేతలు హెచ్చరించారు. మంగళవా రం అరకులోయలో జరిగిన బంద్ సందర్భంగా పట్టణంలో దుకాణాలు, హోటల్స్, రెస్టారెంట్‌లు, విద్యా సంస్థలు, పెట్రోల్‌బంక్‌లు, పద్మాపురం గార్డెన్, ట్రైబల్‌మ్యూజియం, కాఫీహౌస్, చాక్లెట్ ఫ్యాక్టరీ పూర్తిస్థాయిలో మూత పడ్డాయి. బస్సులు, ప్రైవేట్ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో రహదారులు నిర్మానుష్యంగా కనిపించాయి. అన్ని వర్గాల వారు బంద్‌కు సంపూర్ణ మద్దతు ఇచ్చారు. ఆదివాసీ గిరిజన సంఘం, సీఐటీయూ , సీపీఎం, కాంగ్రెస్, వైసీపీ, డీఎల్‌ఓ పార్టీలకు చెందిన నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల ప్రతినిధులు రోడ్లపైకి వచ్చి బంద్‌లో పాల్గొన్నారు. అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం, ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు పాల్గొన్నారు. వీరు ఆది వాసీ సంఘం నేత పొద్దు బాలదేవ్‌తో కలిసి డప్పు కొట్టి తమ నిరసనను వ్యక్తం చేశారు. గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బాలదేవ్, ఉపాధ్యక్షుడు బాలదేవ్, సీపీఎం నేత కిండంగి రామారావు, జడ్పీటీసీ సభ్యులు రోష్ని, కమిడి అశోక్ , ఎంపిటిసి సభ్యులు దురియా ఆనంద్, శత్రుఘ్న , సీఐటియూ నేత ఉమామహేశ్వరరావు, సుంకరమెట్ట సర్పంచ్ చినబాబు, పెదలబుడు మాజీ సర్పంచ్ చిన్నారావు పాల్గొన్నారు. సీఐ హిమగిరి, ఎస్ఐలు,సిబ్బందితో కలిసి అవాంఛనీయ ఘటనలు లేకుండా చర్యలు చేపట్టారు.

కొయ్యూరులో పాక్షికం

కొయ్యూరు: మండలంలో బంద్‌పాక్షికంగా ప్రశాంతంగా జరిగింది. డౌనూరులోవ్యాపార సంస్థలు మూతపడ్డాయి. కొయ్యూరు, మంప, బూదరాళ్ళవెళ్ళాల్సిన బస్సులు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా కొయ్యూరు పోలీస్ స్టేషన్ వరకు తిప్పారు. డౌనూరులో అఖిల పక్ష నేతలు రోడ్డుపై బైఠాయించారు. అనంతరం కాకరపాడు కూడలిలో రాస్తారోకో చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు యథావిధిగా పనిచేశాయి.కొయ్యూరులో మంప ఎస్ఐ శంకరరావు ఆధ్వర్యంలో, డౌనూరులోసీఐ వెంకటరమణ, కొయ్యూరు ఎస్ఐ కిశోర్‌వర్మ ఆధ్వ ర్యంలో సిబ్బందితో కలసి గస్తీనిర్వహించారు.బంద్‌లో ఎంపీటీసీ సభ్యుడు వారా నూకరాజు, ఎంపీటీసీ బిడజాన అప్పారావు, సమ్మగిరి ఎంపీటీసీ ఉల్లి సత్యనారాయణ, దొండ ప్రసాద్, కొయ్యూరులో సీ పీఎం నేత సూరిబాబు, సీపీఐ కు చెందిన ఇరవాడ దేముడు, రాజేంద్రపాలెం ఎంపీటీసీ అంబటి నూకాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిలో ..

చింతపల్లి: ఆర్టీసీ బస్సులను అధికారులు డిపోలకే పరిమితం చేశారు. పలు ప్రాంతాల నుంచి రాత్రివేళ బస్సులు ఆలస్యంగా సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యాయి. ప్రైవేటు వాహనాలు నిలిచిపోయాయి. 17 పంచాయతీల్లో దుకాణాలను మూసివేశారు. నాయకులు చింతపల్లి మూడు రోడ్ల కూడలి వద్ద బైఠాయించారు. లారీలు,ప్రైవేటు వాహనాల రాకపోకలను అఖిలపక్షం నాయకులు అడ్డుకున్నారు. ఒంటి గంటకు సీఐ ఎం. వినోద్ బాబు జోక్యం చేసుకుని లారీలు, బస్సులను గ మ్యస్థానాలకు పంపించారు. ఈకార్యక్రమంలో గిరిజన సంఘం జి ల్లా గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్, జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్, స్థానిక ఎంపీపీ కో రాబు అనుషదేవి, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజుబాలయ్య, సర్పం చుల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జల్లి హలియారాణి, కాంగ్రెస్ నేత రీమల భరత్, మాజీ ఎంపీపీ కవడం మచ్చమ్మ పాల్గొన్నారు.

గిరిజన చట్టాల జోలికి వస్తే సహించేదిలేదని గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. మంగళవారం చింతపల్లిలో ఆదివాసీ సంఘాలు, వివిధ పార్టీ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్, స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి, జడ్పీటీసీ పోతురాజుబాలయ్య, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో..

ముంచంగిపుట్టు: స్పీకర్ అయ్యన్న పాత్రుడు వాఖ్యలకు నిరసనగా అఖిలపక్షం, ప్రజా సంఘాలు చేపట్టిన మన్యం బంద్ మంగళవారం విజయవంతమైంది. బంద్‌కు ఆదివాసీ జేఏసీ, వాలంటీర్లు, మేస్త్రీ సంఘాలు తమ మద్దతుతెలిపాయి. స్థానిక వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేశారు. వాహన రాకపోకలు జరగలేదు. నాయకులు ఉదయం నుంచి నాలుగు రోడ్ల కూడలిపై బైఠాయించి ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్షం, ప్రజా సంఘాల నాయకులు నర్సయ్య, ఎం.ఎం.శ్రీను, జగబంధు, త్రినాధ్, పద్మారావు, దేవ, నీలకంఠం, సర్పంచులు పాల్గొన్నారు.


సీలేరులో రోడ్డుపై భోజనాలు చేస్తున్న దృశ్యం


అరకులో డప్పులు వాయిద్యాలతో ఎమ్మెల్యే మత్స్యరాస, తదితరుల ఆందోళన


చింతపల్లిలో బైఠాయించిన నాయకులు


హుకుంపేటలో నిరసన


కొయ్యూరు: డౌనూరులో రహదారిపై బైఠాయించిన ఆందోళనకారులు


ముంచంగిపుట్టులో నినాదాలు చేస్తున్న నాయకులు

సీలేరు: జీకేవీధి మండలం సీలేరు, ధారకొండ, గాలికొండ పంచాయతీ సప్పర్లలో చేపట్టిన బంద్ విజయవంతమైంది. గాలికొండ పంచాయతీ సప్పర్లలో సర్పంచ్ బుజ్జిబాబు ఆధ్వర్యంలో రోడ్డుకు అడ్డంగా బారికేడ్లను వేసి వాహన రాకపోకలను అడ్డగించారు. దీంతో డొంకరాయి, పాడేరు, సీలేరు విశాఖ బస్సులు సప్పర్లలో ఉద యం ఏడు నుంచి పది గంటల వరకు గిరిజన సంఘాల నాయకులు నిలిపివేశారు. అనంతరం విడిచిపెట్టారు. ఈ సందర్భంగా బస్సుల్లోని ప్రయాణికులకు టిఫిన్, భోజనాలనువండి పెట్టారు. ధార కొండ, సీలేరుల్లో దుకాణాలను మూసివేసి బంద్‌కు సహకరించారు. ఈ కార్యక్రమంలో సీలేరు సర్పంచ్ దుర్గో, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుంకర విష్ణుమూర్తి, బి కోటేశ్వరరావు, ఇర్మియ, పెసా కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరిలో..

అనంతగిరి: మండలంలోని బంద్ విజయవంతమైంది.. వెంకయ్యపాలెం వద్ద రోడ్డుపై జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, వైసీపీ మండల అధ్యక్షుడు సూర్యానారాయణతో పాటుగా అఖిలపక్షం నాయకులు బైఠాయించారు. 1/70 యాక్ట్‌పై శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలను వెనక్కి తిసుకోవాలని డిమాండ్ చేశారు. ములియగుడ వద్ద రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలిపివేశారు. ఈ కార్యక్రమంలోని సర్పంచులు పాగి అప్పారావు, పెంటమ్మ, సింహాద్రి, మజ్జి అప్పారావు, రాములమ్మ, మోస్య, ఎంపీటీసీలు మితుల, తౌటినాయుడు, అశోక్, లక్ష్మణరావు, శాంతిరావు, తదితరులు పాల్గొన్నారు.

బొర్రా గుహలు మూసివేత...

ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలను మూసివేశారు. దీంతో పర్యాటకులు సైతం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. దుకాణాల మూసివేతతో చిన్నారులు, వృద్ధులు ఆకలితో అలమటించారు.

హుకుంపేట: స్థానిక నాలుగు రోడ్లు, మెయిన్ రోడ్డు వద్ద ధర్నా జరిగింది. వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసి బంద్‌కు మద్దతు పలికారు. గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.క్రిష్ణారావు, వైఎస్ఎంపీపీ కోండలరావు, వైసీపీ నేతలు సురేశ్‌కుమార్ , కొండ బాబు, భూషణ్, సీపీఎం నేతలు హైమావతి, రామారావు, కృష్ణమూర్తి, ఉపాధ్యాయ, ఇతర పలు సంఘ నేతలు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

కొయ్యూరు: 1/70 యాక్టును సవరించే యోచన ప్రభుత్వానికి లేదని స్వయానా ముఖ్యమంత్రి ప్రకటించారని, ఈ విషయంలో గిరిజనులు ఆందోళన చెందాల్సిన పని లేదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎం వీవీ ప్రసాద్ అన్నారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేలా వారి సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ పాలన సాగిస్తున్నదని సూచించారు.

డుంబ్రిగుడ: మండలంలోని డుంబ్రిగుడ, కించుమండ, అరకు ప్రధాన రహదారిలో అఖిలపక్ష నాయకులు నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ కుంభ రవిబాబు, సీపీఎం నేతలు పోతురాజు, సూర్యనారాయణ, ఎంపీపీ సింహాచలం, సర్పంచి నాగేష్ పాల్గొన్నారు.

'గిరిజన హక్కుల పరిరక్షణకు కూటమి కట్టుబడి ఉంది'

కూటమి ప్రభుత్వం గిరిజన హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉన్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్బారావు అన్నారు.1/70 చ ట్టంపై వైసీపీ చేస్తున్న ప్రచారాన్ని గిరిజనులు నమ్మవద్దని, చట్ట సవరణ చేసే ఆలోచన కూటమి ప్రభుత్వనికి లేదని చెప్పారు.గిరిజన ఎమ్మెల్యేలు జీఓ 3 పునరుద్ధరణపై ఎందుకు నోరు మెదపలేదన్నారు. కూటమి నాయకులు స్వామి, గంగాధర్, సింహాద్రి చంటి పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: మండల కేంద్రం, రింతాడ, పెదవలస జాతీయ రహదారితోపాటు వంచుల, జర్రెల, మొండిగెడ్డ, దేవరాపల్లి, అక్కవరపుపేట, సంకాడ, అసరాగా గ్రామాల్లో ఆదివాసీలు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు, నిరసనలు చేశారు. చింతపల్లి-కృష్ణాదేవిపేట, జీకేవీధి ప్రధాన రహదారుల్లో వాహనాలను నిలిపివేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు యథావిధిగా నడిచాయి. గిరిజన సంఘంనేతఅంపురంగి బుజ్జిబాబు, ఎంపీపీ బోయిన కుమారి, రింతా ఉప సర్పంచ్ సోమేశ్‌కుమార్, కాంగ్రెస్ నేత కోనా ఎల్లారావు తదితరులు పాల్గొన్నారు.

చట్టాన్ని సవరించే యోచన లేదు: టీడీపీ


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

గూడెంకొత్తవీధి: భూ బదలాయింపు చట్టాన్ని సవరించే ఆలోచన కూటమి ప్రభుత్వానికి లేదని టీడీపీ మండలాధ్యక్షుడు ముక్కలి రమేశ్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గిరిజన హక్కులను పరిరక్షించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జీవో నంబరు-3 పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యురాలు గంటా నళిని, ఎంపీటీసీ సభ్యురాలు పసుపులేటి నాగమణి, మాజీ సర్పంచ్ పసుపులేటి రామకృష్ణ పాల్గొన్నారు.

'వైసీపీ నేతల మాటలను నమ్మొద్దు'

చింతపల్లి: గిరిజన హక్కులు, చట్టాలను పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు స్పష్టం చేశారు. మంగళవారం టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు అధ్యక్షతన పార్టీ ముఖ్య నాయకులు సమావేశమై మాట్లాడారు. వైసీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఆదివాసీలు నమ్మరాదన్నారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి శెట్టి నాగేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.


అనంతగిరి: వెంకయ్యపాలెం వద్ద బైఠాయించిన అఖిలపక్షం నేతలు


డుంబ్రిగుడలో..


పెదబయలులో...

జడ్పీ అతిథి గృహానికి త్వరలో మోక్షం

- మరమ్మతులకు రూ.15 లక్షలతో ప్రతిపాదనలు

చింతపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జిల్లా పరిషత్ అతిథి గృహానికి మోక్షం కలగనున్నది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రభుత్వ అతిథి గృహాలు ఆధునికీకరణ, మరమ్మతులకు ప్రాధాన్యమిస్తోంది. ఈ క్రమంలో స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహం మరమ్మతులకు మండల పరిషత్ అధికారులు రూ.15లక్షలతో జడ్పీ సీఈవోకి ప్రతిపాదనలు పంపించారు. ఈ నెలాఖరు నాటికి నిధులు విడుదలకానున్నాయి. ఈ అతిథి గృహంలో ఒక డైనింగ్ హాల్, ఒక షూట్, నాలుగు గదులు ఉన్నాయి. ఫర్నీచర్, విద్యుత్, రన్నింగ్ వాటర్, ఇతర కనీస సదుపాయాలు అందుబాటులోలేవు, గదులు పాడైపోయాయి. గత ఐదేళ్లగా ఈ భవనాన్ని వైసీపీ ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు.దీనిని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు నిధులు మంజూరుకు కూటమి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఈమేరకు రోజుల వ్యవధిలోనే అందుబాటులోకి రానున్నది. అతిథి గృహం ప్రాంగణంలో సామాజిక భవనం నిర్మాణానికి ఎంపీ తనూజారాణి రూ.40లక్షలు కేటాయించారు.


మరమ్మతులకు సిద్ధమవుతున్న అతిథి గృహం

సీలేరులో కోతుల నియంత్రణకు చర్యలు

సీలేరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరులో కోతుల నియంత్రణకు చర్యలకు సిద్ధమవుతున్నారు. ఏపీ జెన్‌కో హైడల్ డైరెక్టర్ సుజయ్‌కుమార్ స్థానిక ఇన్‌చార్జి ఎస్ఐ, పంప్డ్ సోటరేజ్ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డికి కొద్దిరోజుల కిందట ఆదేశించారు. సీలేరులో రెండేళ్ల క్రితం 200 ఉండే వానరాలు ప్రస్తుతం 1000 కి పైగా పెరిగిపోయాయి. దీంతో ప్రజలను ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. రోజూ ఇళ్ల పైకప్పులపై స్వైరవిహారం చేస్తూ, లోనికి చొరబడి వండుకున్న ఆ హార పదార్థాలను గిన్నెలతో సహా ఎత్తుకుపోతున్నాయి. విద్యుత్, టెలిఫోన్ వైర్లపై వేలాడుతూ విద్యుత్, ఇంటర్నేట్ సౌకర్యాలకు అంతరాయం కలిగిస్తున్నాయి. దీనిపై ఇటీవల సీలేరు పర్యటనకు వచ్చిన జెన్‌కో హైడల్ డైరెక్టర్ దృష్టికి స్థానికులు తీసుకువెళ్లారు. ఆయన ఆదేశాల పై చర్యలు తీసుకుంటున్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

- సీహెచ్‌సీ, పీహెచ్‌సీల తనిఖీలో కేంద్ర వైద్య ఆరోగ్య బృందం


ముంచంగిపుట్టు సీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం ప్రతినిధులు

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్, కిలగాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ బృందం మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. గిరిజనులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు.. కేంద్ర సచివాలయ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ అరుణ్.. మందుల నిల్వలతో పాటుగా పరిసరాలను పరిశీలించారు.. రికార్డులను క్షుణంగా పరిశీలించి, పలు సూచనలు చేశారు. అనంతరం వార్డులను పరిశుభ్రంగా ఉంచాలని, రోగులు పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. కేసులు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నట్లుగా గుర్తించి, సరి చేసుకోవాలని సూచించారు. రక్తహీనత కేసులపై ప్రత్యేకశ్రద్ధవహించాలని సూచించారు. అనంతరం కర్రీముఖిపుట్టు, దార్రెల గ్రామాల్లో సబ్ సెంటర్లను పరిశీలించారు. ఆయన వెంట విశాఖ జిల్లా మలేరియా అధికారిణి తులసి, అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యనారయణ, ఎస్‌వో కైలాశ్, సీహెచ్‌సీ, పీహెచ్‌సీ వైద్యాధికారులు సంతోశ్, ధరణి, రమేష్, శిరీష, సబ్ యూనిట్ అధికారులు సుబ్రహ్మణ్యం, నూకరాజు, పురుషోత్తం, తదితరులు ఉన్నారు.

ఘనంగా గంగా దేవత ఉత్సవం


సీకరిలో గంగా దేవత ఆశిస్సులు తీసుకున్న టీడీపీ నాయకులు

పెదబయలు, ఫ్రిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గంగా దేవత ఆశీస్సులు అందరిపై ఉండాలని తెలుగుదేశం పార్టీ డివిజన్ నాయకుడు, దారెల పంచాయతీ సర్పంచి పాంగి పాండురంగ స్వామి ఆకాంక్షించారు. మంగళవారం మండలంలోని సీకరి గ్రామంలో జరిగిన గంగా దేవత ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ మండల అధ్యక్షురాలు సీకరి సుకుమారితో కలసి వారు సందర్శించారు. గంగా తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, గిరిజన ప్రాంతం అభివృద్ధితో ముందుకు సాగాలని అమ్మవారికి పూజలు చేసినట్టు చెప్పారు. ఇటువంటి జాతరలతో ఆదివాసీలకు ఒక ప్రత్యేక గుర్తింపు వస్తుందన్నారు. ఆయన వెంట బాకూరు వెంకటరమణ రాజు, శశిభూషణ్ నాయుడు, మురళి తదితరులు ఉన్నారు.

గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు

- చింతపల్లి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఇందిరా ప్రియాంక


మాట్లాడుతున్న ఇందిరా ప్రియాంక, పక్కన వైద్యులు

చింతపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో గిరిజనులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు నూతన సూపరింటెండెంట్ డాక్టర్ పి. ఇందిరా ప్రియాంక అన్నారు. మంగళవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఏరియా ఆస్పత్రిలో గతంలో పోల్చుకుంటూ వైద్య సేవలు మెరుగుపడ్డాయన్నారు. వైద్యులు అన్నివేళలా అందుబాటులో ఉంటున్నారన్నారు. రాత్రి వేళలో సైతం విధుల్లో ఓ వైద్యాధికారి ఉంటారన్నారు. ప్రజలకు సేవలను చేయాలనే ఉద్దేశంతో ఫోన్ నంబర్ అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ ఫోన్ డ్యూటీ వైద్యుడి వద్ద ఉంటుందని, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, ఇతర సమస్యలను స్వయంగా స్వీకరిస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య నిపుణుల ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటుందన్నారు. ఆస్పత్రిలో గైనికాలజిస్టు కూడా త్వరలో అందుబాటులోకి వస్తారన్నారు. ప్రజలకు వైద్యపరంగా ఎటువంటి సమస్య కలిగిన సంప్రదించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు చంద్రశేఖరరావు, లావణ్య, భారతి, రమేష్, సరోజిని పాల్గొన్నారు.

రేషన్ సరుకుల కోసం పడిగాపులు

- గ్రామాల నుంచి కిలో మీటర్ల మేర కాలినడక
- ఎండీఎం వాహనం రాకపోవడంతో గిరిజనుల నిరాశ


వట్టి చేతులతో స్వగ్రామాలకు వెళుతున్న గిరిజనులు

అనంతగిరి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పినకోట బోనూరు, చీడిమెట్ట, గడ్డిబంధ, వంట్లమామిడి ఆయా గ్రామాల గిరిజనులు రేషన్ సరకులు కోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఘాటీ కావడంతో ఆయా గ్రామాలకు ఎండీఎం వాహనం వెళ్లే పరిస్థితి లేదు. దీంతో రేషన్ సరుకులు కోసం ఆయా గ్రామాల గిరిజనులు సుమారు 6 కిలో మీటర్లు కాలినడక మంగళవారం ఉదయం 11 గంటలకు చటకంభ గ్రామానికి చేరుకున్నారు.. అయితే, సాయింత్రం 5 గంటల వరకు ఎండీఎం వాహనం కోసం ఎదురుచూసినా అది రాకపోవడంతో తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. కాలినడకన తిరిగి ఆయా గ్రామాలకు ప్రయాణమయ్యారు.. ఎండీఎం ఆపరేటర్ ద్వారా గ్రామాల్లోనే సరుకులు అందేవిధంగా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే, రోడ్డు పనులు త్వరితగతిన పూర్తిచేయాలని గిరిజనులు డిమాండ్ చేశారు.

గిరిజన హక్కులకు భంగం కలిగితే ఉద్యమిస్తాం

- టీడీపీ పాడేరు డివిజన్ నాయకుడు పాండురంగస్వామి


మాట్లాడుతున్న పాండురంగస్వామి

పాడేరురూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): తమ ఉనికిని చాటుకొనేందుకు వైసీపీ నాయకులు చేస్తున్న మోసపూరిత ప్రచారాలను ఆదివాసీ ప్రజలు నమ్మవద్దని తెలుగుదేశం పార్టీ డివిజన్ నాయకుడు, దారెల పంచాయతీ సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి అన్నారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ ప్రాంతంలో 1/70 చట్టం పటిష్టంగా అమలు చేసే సత్తా ఉన్న ఏకైక పార్టీ టీడీపీయేనని అన్నారు. వైసీపీ నాయకుల మోసపూరిత ప్రలోభాలకు ఆదివాసులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గిరిజన హక్కులకు భంగం కలిగితే తామే ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బాకూరు సర్పంచ్ బాకూరు వెంకటరమణ, అండిభ సర్పంచి టి.సత్యనారాయణ, పెదబయలు మండల మహిళా అధ్యక్షురాలు కిముడు మహేశ్వరి, టీడీపీ నాయకులు మన్మధరావు, శివసాగర్, జగదీశ్, తిరుపతి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కొత్తూరు వంతెన

- బ్రిడ్జి రోడ్డుపై అడుగడుగునా గతుకులు
- బిక్కుబిక్కుమంటూ వాహన చోదకుల రాకపోకలు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు

కొత్తూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ కొత్తూరులోని వంతెన అడుగడుగునా గోతులతో దర్శనమిస్తోంది. ఎక్కడికక్కడ పెద్ద రంధ్రాలతో ప్రమాదకరంగా పరిణమించింది. ఇది వాహన చోదకులను భయాందోళనకు గురిచేస్తోంది.

ఈ వంతెనపై 2008 నవంబరు 23న కశింకోట-బంగారు మెట్టకు వెళ్లేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు రూ.21 కోట్లు వెచ్చించి రోడ్డు నిర్మాణం చేపట్టారు. కాలక్రమేణా బ్రిడ్జిపైన పెద్ద పెద్ద గోతులు పడడమే కాకుండా రైల్వే ట్రాక్‌పై నిర్మించిన బ్రిడ్జి నుంచి ఊచలు బయటకు దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సుమారు అర్ధ కిలోమీటరు దూరం ఉన్న ఈ బ్రిడ్జిపై నుంచి ప్రతి రోజూ 36 గ్రామాలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. అంతేగాకుండా రైల్వే అధికారులు నిర్మించిన బ్రిడ్జి కనక్టర్స్‌పై ఐరన్ బిడ్‌లు పూర్తిగా జంగుపట్టి ఊడిపోయాయి. ఇవి మరింత ప్రమాదభరితంగా మారిపోవడమే కాకుండా వాహనాలు ఆయా గోతుల్లో పడి తీవ్ర గాయాల పాలవుతున్నారు.





కాలేజీ కూడలి వద్ద వంతెనపై పూర్తిగా దెబ్బతిన్న రహదారి... ధ్వంసమైన బ్రిడ్జి కుడి వైపు ఫుట్‌పాత్

వైసీపీ ప్రభుత్వ హయాంలో తూతూమంత్రంగా పనులు

వైసీపీ ప్రభుత్వ హయాంలో దెబ్బతిన్న రోడ్లను తూతూమంత్రంగా వేయడం వల్లే నేడు ఈ దుస్థితికి చేరాయని వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్న చిన్న రంధ్రాలు పడినప్పుడు స్పందించినట్లయితే ఇంత భారీగా గుంతలు పడి ఉండవని అభిప్రాయపడుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా రహదారులు చక్కదిద్దుతారని ఆయా గ్రామాల ప్రజలు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు.



బ్రిడ్జిపైన రోడ్డు నుంచి ఊచలు బయటకు కనిపిస్తున్న దృశ్యం

శిథిలావస్థకు చేరిన ఫుట్‌పాత్‌లు

గతంలో బ్రిడ్జిపై కుడి, ఎడమ వైపు ఉన్న ఫుట్‌పాత్‌లపై పాదచారులు రాకపోకలు సాగించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇరువైపులా శిథిలావస్థకు చేరుకోవడమే కాకుండా కొన్ని చోట్ల ధ్వంసమయ్యాయి. బ్రిడ్జి నిర్మాణం చేసిన కాంట్రాక్టర్ నాణ్యతాప్రమాణాలు పాటించకపోవడం, అధికారుల పర్యవేక్షణ అంతంతమాత్రంగా కావడంతో తక్కువ సమయంలోనే శిథిలావస్థకు చేరుకున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు.

బ్రిడ్జిపై మరమ్మతులు చేపట్టాలి

కొత్తూరు బ్రిడ్జిపై మరమ్మతు పనులు చేపట్టి వాహన చోదకులను ప్రమాదాల బారి నుంచి కాపాడాలని కోరుతున్నారు. నాణ్యతాప్రమాణాలు పక్కాగా పాటిస్తే రోడ్డు శాశ్వతంగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. పరిమితికి మించి వాహనాలను అదుపుచేయాలని కోరుతున్నారు.



ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును సత్కరిస్తున్న జనసేన కార్యకర్తలు

కూటమి నేతలతో సామరస్యంగా నడుచుకోండి

జనసేన కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే పంచకర్ల

సబ్బవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో తన గెలుపునకు కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని, కూటమి నేతలతో సామరస్యంగా నడుచుకోవాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు చెప్పారు. మండలంలోని గొటివాడ గ్రామంలో మంగళవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచకర్లను నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలోనే జనసేన మండల/గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యకర్తలందరికీ తన కార్యాలయంలో అందుబాటులో ఉంటానన్నారు. గ్రామాల అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు ఇందలి వెంకటరమణ, బలిరెడ్డి అప్పారావు, సాలాపు వెంకటేశ్వరరావు, పంచకర్ల వెంకటేశ్వరరావు, సాలాపు మీన, కర్రి నరసింగరావు, మామిడి శంకరరావు, దాడి జాన్సీలక్ష్మీరాణి, శరగడం రాము, బంతికోళ్ల పద్మ, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- పరవాడ ఎస్‌ఐ కృష్ణారావు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌ఐ కృష్ణారావు

పరవాడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పరవాడ ఎస్‌ఐ బి.కృష్ణారావు సూచించారు. స్థానిక జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ మహిళలతో ఐద్వా ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌ను నమ్మవద్దన్నారు. గంజాయి విక్రయాలు జరుగుతున్నట్టు దృష్టికి వస్తే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కాలనీలో అపరిచిత వ్యక్తులు కంట పడితే తక్షణమే పోలీసులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి పద్మావతి, జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం, ఐద్వా ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

చెరువు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

- ఇరిగేషన్ డీఈకి నీటి సంఘం చైర్మన్, డైరెక్టర్ల వినతి



డీఈకి వినతిపత్రం అందజేస్తున్న నీటి సంఘాల డైరెక్టర్లు

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): భట్లపూడి పంచాయతీ పరిధిలో ఉన్న ఎరకన్నదొర చెరువు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సాగునీటి సంఘం చైర్మన్ పి.శంకరరావు కోరారు. ఈ మేరకు నీటిపారుదల శాఖ డీఈ ఎం.అమూల్యను మంగళవారం డైరెక్టర్లతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ చెరువు ఆయకట్టు రైతులకు రెండు మదుములు ఉన్నాయని, అవి శిథిలావస్థకు చేరాయని తెలిపారు. అలాగే చెరువులో పూడిక, ఏపుగా పెరిగిన తుప్పలను తొలగించాలని విన్నవించారు. చెరువును అభివృద్ధి చేస్తే రైతులకు కలిగే ప్రయోజనాలను డీఈకి వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ బాబూరావు, డైరెక్టర్ సూర్య భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక గ్రంథాలతో ఇంటింటా ప్రచారం



గ్రంథాలతో ప్రచారం చేస్తున్న సేవా సమితి సభ్యులు

పరవాడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మాఘమాసాన్ని పురస్కరించుకొని త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానందయోగేశ్వరస్వామి రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, దాని అనుబంధ గ్రంథాలతో మంగళవారం దేశపాత్రుని పాలెంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మాఘ పౌర్ణమి, శివరాత్రి పండుగల ప్రత్యేకతను వివరించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూజ్ఞాన వేదిక ప్రతినిధులు ప్రచారం చేశారు. కమిటీ సభ్యులు శ్రీనివాస్, రమేశ్, రమణ, లక్ష్మి, సత్యవతి, దేవి, అప్పలనాయుడు పాల్గొన్నారు.

రామచంద్రమ్మ జాతర వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



జాతర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

పరవాడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధి గాంచిన వాడచీపురుపల్లి రామచంద్రమ్మ అమ్మవారి జాతరకు సంబంధించి వాల్‌పోస్టర్లను ఉత్సవ కమిటీ ప్రతినిధులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ నెల 16, 17, 18 తేదీల్లో జాతర జరుగుతుందని వారు చెప్పారు. దీనిలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు వివిధ ఆటల పోటీలు ఏర్పాటు చేస్తామన్నారు. జాతరకు జిల్లా నలుమూలలు నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ శివలంక లక్ష్మి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు బూసు అప్పలరాజు, కె.అప్పలనాయుడు, బి.అప్పలరాజు, కూండ్రపు శ్రీరామ్మూర్తి, జి.నానాజీ, సీతారామయ్య పాల్గొన్నారు.

15న ధ్వజ స్తంభం ప్రతిష్ఠా మహోత్సవం

సబ్బవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బంగారమ్మపాలెం కోదండ సీతారామాలయం ఆవరణలో ఈ నెల 15న ధ్వజ స్థంభం ప్రతిష్ఠా మహోత్సవం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సభ్యులు కోరారు.

గ్రామాల్లో వైభవంగా అమ్మవార్ల జాతరలు

తుమ్మపాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అమ్మవార్ల జాతరలు మంగళవారం వైభవంగా జరిగాయి. తుమ్మపాలలో గంగాలమ్మతల్లి అమ్మవారి పండుగ నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయం వద్ద ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని సారె, చీరలను సమర్పించి మొక్కులు, ముడుపులను తీర్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద తప్పెటగుళ్ళు, దేవతామూర్తుల వేషధారణలు, కోలాటాలు అందరినీ ఆకర్షించాయి.

మూలపేటలో గంగాలమ్మ పండుగ

కొత్తూరు: సత్యనారాయణపురం పంచాయతీలోని మూలపేట గ్రామంలో మంగళవారం గంగాలమ్మ తల్లి పండుగ వైభవంగా జరిగింది. అమ్మవారిని భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

మార్టూరు, బీఆర్టీ కాలనీల్లో పరదేశమ్మ ఉత్సవం

పిసినికాడ పంచాయతీలోని బీఆర్టీ కాలనీ, మార్టూరు గ్రామంలో పరదేశమ్మతల్లి ఉత్సవం ఘనంగా జరిగింది. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున నుంచి మహిళలు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మలసాల భరత్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఉత్సవ కమిటీ చైర్మన్ మళ్ల శ్రీనివాసరావు, ఎం.నాగఅప్పారావు, కరణం శ్రీనివాసరావు భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.





తుమ్మపాలలో అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్... మూలపేటలో గంగాలమ్మను పూజలు చేస్తున్న భక్తులు

జి.భీమవరంలో గంగాలమ్మతల్లి జాతర

కశింకోట: మండలంలోని జి.భీమవరం గ్రామంలో గంగాలమ్మతల్లి పండుగ మంగళవారం వైభవంగా జరిగింది. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సాయంత్రం పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

పిట్టవానిపాలెంలో పైడితల్లమ్మ పండుగ

పరవాడ: జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని పిట్టవానిపాలెం గ్రామంలో పైడితల్లి అమ్మవారి పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి భక్తులు ఆలయం వద్ద బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకొని ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారితో పాటు పలువురు నాయకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను పురవీధుల్లో మేళతాళాల నడుమ ఊరేగించారు. అనంతరం ఆలయం వద్ద అనుపోత్సవం నిర్వహించారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

బలిజపాలెంలో పోలిపల్లమ్మ పేరంటాలు తీర్థం

సబ్బవరం: మండలంలోని నారపాడు శివారు బలిజపాలెం గ్రామంలో పోలిపల్లమ్మ పేరంటాలు తీర్థ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి దూప, దీప నైవేద్యాలతో అమ్మవారికి పూజలు చేశారు. మధ్యాహ్నం చిడతల భజనలు, కోలాటం, నేల డ్యాన్సలు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బక్క సింహాచలం కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు మామిడి లక్ష్మీ, నాయకులు ఎం.కొండాజీ, ఎస్.దుర్గా అప్పారావు అమ్మవారిని పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలి

- జిల్లా రవాణా శాఖాధికారి మనోహర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్టీవో మనోహర్

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు రహదారిపై ప్రయాణం సాగించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా రవాణా శాఖాధికారి (ఆర్టీవో) మనోహర్ సూచించారు. రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా మంగళవారం డైట్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన రహదారి భద్రతా అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతీ విద్యార్థి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ వేసుకోవాలని, కారు ప్రయాణంలో సీటు బెల్ట్ ధరించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో యువత ఎక్కువ మంది చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల విద్యార్థులు ప్రయాణం సాగించేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పి.గోపీకృష్ణ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు, భద్రతా నియమాలు పాటించడం వల్ల ప్రమాదాలను నియంత్రించవచ్చునన్నారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ ది ఎబిలిటీ పీపుల్ సంస్థ వెన్నుపూసలో గాయపడిన శారీరక దివ్యాంగులకు, ఎముకల సమస్యలు ఉన్న వారికి చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ దిలీప్ పాత్రోకు అభినందనలు తెలుపుతూ సంస్థకు రూ.లక్ష విరాళంగా అందచేస్తున్నట్టు ప్రకటించారు. రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా విద్యార్థులతో రవాణా శాఖ అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డైట్ కళాశాల భద్రతా నియమాలతో కూడిన కరపత్రాలను ప్రారంభించారు. ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎ.గీతాకావ్య, ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమర గాయకుడు ఘంటసాలకు ఘన నివాళులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేల్పులవీధి జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 51వ వర్ధంతి మంగళవారం సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగింది. ఘంటసాల చిత్రపటానికి అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అపూర్వ, జ్యోష్న, దుర్గాభాయి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. జ్యోతి, చార్విక్ నాలుగు, ఐదు బహుమతులు దక్కించుకున్నారు. వీరికి అసోసియేషన్ ప్రతినిధులు వినకోట నీలేష్‌గుప్తా, రొబ్బి మల్లేశ్వరరావు, కె.రామారావు, ఎన్.అప్పారావు తదితరులు ప్రశంసాపత్రాలు, బహుమతులను అందజేశారు.

18న వాలీబాల్ పోటీలు

పరవాడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడచీపురుపల్లి రామచంద్రమ్మ అమ్మవారి జాతరను పురస్కరించుకొని ఈ నెల 18న ఉత్తరాంధ్ర పరిధి జిల్లాల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఈ నెల 17 సాయంత్రం ఆరు గంటలలోపు తమ పేర్లను కమిటీ వద్ద నమోదు చేయించుకోవాలని సూచించారు. విజేతలకు నగదుతో పాటు జ్ఞాపికలను అందజేస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం 9440294143, 7036403132 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

దుర్గమాంబ జాతరకు ఏర్పాట్లు

పరవాడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలపాక గ్రామ ప్రజల ఆరాధ్య దేవత దుర్గమాంబ అమ్మవారి పండుగను బుధ, గురువారాల్లో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాన రహదారి నుంచి అమ్మవారి ఆలయం వరకు విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. గురువారం తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి అమ్మవారి దర్శనాలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. బుధ, గురువారాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి జాతరను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

పోక్సో చట్టంపై అవగాహన

లంకెలపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పరవాడ మండలం పెదముషిడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోక్సో చట్టం, బాల్య వివాహాల నిర్మూలనపై మంగళవారం మహిళా శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా బాలల పరిరక్షణ ప్రతినిధి డి.లోవరాజు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. లైంగిక వేధింపులకు పాల్పిడితే పోక్సో చట్టం ద్వారా కఠిన చర్యలు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తవ్వవానిపాలెం రైతులకు న్యాయం చేస్తాం

- తహసీల్దార్ చిన్నికృష్ణ
- భూములు, రికార్డుల పరిశీలన



తవ్వవానిపాలెం రైతుల డాక్యుమెంట్లు పరిశీలిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ

సబ్బవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తవ్వవానిపాలెం గ్రామంలో రైతులకు న్యాయం చేస్తామని బి.తహసీల్దార్ చిన్నికృష్ణ హామీ ఇచ్చారు. గ్రామంలో 109 మంది రైతులు తమ భూముల వివరాలు రెవెన్యూ రికార్డులలో అక్రమంగా తొలగించారని, తిరిగి తమ పేర్లు రికార్డుల్లో నమోదు చేసి న్యాయం చేయాలని రెండు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మరలా రైతులు రెవెన్యూ సదస్సుల్లో తహసీల్దార్‌కు, ప్రస్తుత ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు తహసీల్దార్ చిన్నికృష్ణ, మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, ఆర్‌ఐ వీరయ్య మంగళవారం తవ్వవానిపాలెంలో క్షేత్ర స్థాయి భూములను పరిశీలించారు. రైతులు వద్ద ఉన్న అన్ని రకాల డాక్యుమెంట్లు, పాత 1బీ పత్రాలు, ఇతర హక్కు పత్రాలను క్షుణంగా పరిశీలించారు. సర్పంచ్ బోకం స్వామినాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బోకం అర్జునుడు, గ్రామ పెద్దలు, రైతులు మాట్లాడుతూ 2006లో కొంత మంది ఈ భూములకు తప్పుడు రికార్డులు సృష్టించి, అప్పటి ఒక రెవెన్యూ ఉద్యోగి సహకారంతో డాక్యుమెంట్లు తయారు చేసి తమ పేర్లను 1బీ రికార్డు నుంచి తొలగించారని చెప్పారు. ఇప్పుడు ఆ భూముల్లో 109 మంది రైతులు సాగులో ఉన్నారన్నారు. అన్ని రకాల డాక్యుమెంట్లు, మ్యాప్‌లు, గతంలో చేసిన ఫిర్యాదులు విన్నపాలు, దర్యాప్తు కాపీలను తహసీల్దార్ పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. సర్వే నెంబరు 423/10లో రైతులు సాగులో ఉన్నారని, రికార్డుల పరిశీలన మేరకు సాగులో కూడా ఉన్నందున రైతులకు న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు బోకం శ్రీరామమూర్తి, బాలకృష్ణ, బండారు సింహాచలంనాయుడు, కొల్లి వెంకటరావు, వేచలపు సత్యనారాయణ, రైతులు ఉన్నారు.

టమాటా ధర నేల చూపులు

- కిలో రూ.5 పలకడంతో రైతుల గగ్గోలు

మాకవరపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): టమాటా ధర నేల చూపులు చూసింది. రోజురోజుకూ ధర పడిపోతుండడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. మాకవరపాలెం మండల కేంద్రంలో మంగళవారం జరిగిన వారపు సంతలో టమాటా క్రేట్ (30 కిలోలు) టమాటాలు రూ.120 నుంచి రూ.150 మాత్రమే ధర పలికింది. అంటే కిలో టమాటా రూ.5 రూపాయల మాత్రమే రైతుకు దక్కింది. ఇటీవల క్రేట్ రూ.300 అమ్మకాలు జరిగాయి. ఒక్కసారిగా కిలో టమాటా రూ.5 ధర పడిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. టమాటా కొసి సంతకు తీసుకువచ్చేందుకు అవుతున్న ఖర్చు కూడా రావడం లేదని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





మాకవరపాలెం వారపు సంతకు దండిగా వచ్చిన టమాటా

ఇ-దర్శన్ భాగ్యం కలిగేనా?

సామాన్యులకు దూరమవుతున్న ఏడుకొండల వెంకన్న

- కొవిడ్ సమయంలో కౌంటర్ల మూసివేత
- ఐదేళ్లుగా పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- గతంలో నగరంలోనే దర్శనం, వసతి టికెట్లు లభ్యం
- కౌంటర్లు నిలిపివేయడంతోనే తిరుపతిలో పెరిగిన రద్దీ
- మళ్లీ తెరవాలని భక్తుల డిమాండ్

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

రానురాను సామాన్యులకు తిరుమల వెంకటేశ్వరుని దర్శనం దుర్లభమవుతోంది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నడిచే కల్యాణ మండపాల్లో ఏర్పాటు చేసిన ఇ-దర్శన్ కేంద్రాలను మూసివేయడంతో ఈ పరిస్థితి ఎదురవుతోంది. గతంలో విశాఖపట్నం ఎంవీపీ కాలనీలోని ఇ-దర్శన్ కేంద్రం నుంచి స్వామివారి దర్శనం టికెట్లు, వసతి గదులు లభ్యమయ్యేవి. రైలు, బస్సు, విమాన ప్రయాణాలు ఖరారైన వారి ఆయా తేదీల్లో అందుబాటులో ఉన్న సమయానికి ఈ టికెట్లను పొంది, వెంకన్నను కనులారా దర్శించుకునేవారు. అయితే కొవిడ్ సమయంలో మూతపడిన ఈ కేంద్రాలను తిరిగి తెరవడంపై గత ఐదేళ్లుగా పాలవర్గాలు, ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ప్రస్తుతం టీటీడీ వెబ్‌సైట్‌లో టికెట్లు లభ్యమవుతున్నా, నిర్దిష్ట సమయం మించిపోతే అంతే సంగతి. దీనిని కొంతమంది సొమ్ము చేసుకుంటున్నారు. ముందుగానే టికెట్లు బుక్ చేసుకుని, బ్లాక్‌లో అమ్ముతున్నారు. పైగా కొన్ని సమయాల్లో టిక్కెట్లకు చాలా ఇబ్బంది ఎదురవుతోంది. గతంలో ఎంవీపీ కాలనీలోని హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యాలయ భవనంలోనే ఇ-దర్శన్ పేరిట టీటీటీ ఓ కౌంటర్‌ను ప్రారంభించింది. నగరం, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు ఇక్కడికి వచ్చి, టికెట్లు కొనుగోలు చేసేవారు. దర్శనం, వసతి సౌకర్యాలకు ఇక్కడే అవకాశం లభించేవి. ఎలాంటి అదనపు చార్జీలు ఉండేవి కావు. ప్రస్తుతం కౌంటర్ లేకపోవడం వల్ల, ఆన్‌లైన్‌లో టిక్కెట్లు దొరకకక నేరుగా తిరుమలకు వెళ్లి ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల తిరుపతి టికెట్ల కౌంటర్ వద్ద తొక్కిసలాటలో విశాఖకు చెందిన ముగ్గురు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఇ-దర్శన్ కౌంటర్ ఉండి ఉంటే ఆ ప్రాణాలు నిలిచేవని చెబుతున్నారు.





ఎంవీపీ కాలనీలోని ఈ భవనంలోనే ఇ- దర్శన్ ఉండేది



భక్తులు కూర్చోవడానికి వీలుగా కుర్చీలు

అందుకే ప్రమాదం

తిరుమలలో ముక్కోటి ఏకాదశి దర్శనానికి టికెట్ల కోసం భక్తులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కౌంటరు వద్దకు చేరుకున్నారు. తమకు దొరకవేమోనన్న కంగారుతో తోసుకోవడం, తొక్కిసలాట కారణంగా ఆరుగురు భక్తులు మృతి చెందడం దేశవ్యాప్తంగా సంచలనమయింది. చరిత్రలో లేని అపప్రద మూటకట్టుకోవాల్సి వచ్చింది. ఇ- దర్శన్ కౌంటర్లు కొనసాగించి ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదని భక్తుల వాదన. ఎంవీపీ కాలనీ టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా 2006లో ఇ- దర్శన్ కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రతి రోజూ వందలాది మంది ఇక్కడ టికెట్లు కొనుగోలు చేసేవారు.

వైసీపీ ప్రభుత్వానిదే పాపం

ప్రస్తుతం జరిగిన సంఘటన గత ప్రభుత్వం చేసిన పాపంగా కొందరు భక్తులు విమర్శిస్తున్నారు. కొవిడ్ సమయంలో ఇ దర్శన్ కౌంటరును మూసివేశారు. ఆ తర్వాత తిరిగి తెరుస్తారని భక్తులు ఎదురుచూశారు. అప్పట్లోనూ ఆన్‌లైన్ టికెట్లు ఉండేవి. కానీ ఇక్కడ కచ్చితంగా టికెట్లు లభిస్తాయనే భావనతో వచ్చేవారు. కొవిడ్ సమస్య తొలగిపోయినా కౌంటర్లు తిరిగి ప్రారంభించడానికి ప్రభుత్వం చొరవ చూపలేదు. టీటీడీ కూడా పట్టించుకోలేదు.

చాలా ప్రయోజనకరం

తిరుపతి దర్శనానికి వెళ్లేవారికి బయో మెట్రిక్, ముఖ చిత్రం, ఆధార్ కార్డుల ఆధారంగా టికెట్లను జారీ చేసేవారు. ఇక్కడ రూ. 300 టిక్కెట్లు లభ్యమయ్యేవి. టికెట్‌తో పాటు గదులను బుక్ చేసుకునే అవకాశం లభించేది. ప్రతి రోజూ భక్తులతో ఈ భవనం కళకళలాడేది. స్వామివారి ఆర్జిత సేవలు రెండు నెలల ముందుగానే తీసుకునే వెసులుబాటుండేది. అనుబంధ దేవాలయాలైన తిరుచానూర్, శ్రీనివాస మంగాపురం టిక్కెట్లు, వసతి కూడా ఇ- దర్శన్‌లో కొనుగోలు చేసుకునే అవకాశం ఉండేది. ముక్కోటి ఏకాదశి శ్రీవారి ఉత్తర ద్వార దర్శన టిక్కెట్లు, కల్యాణవేదిక రిజిస్ట్రేషన్, టీటీడీ క్యాలెండర్లు, డైరీలు, సప్తగిరి మాసపత్రిక విక్రయాలు, విరాళాలు, శ్రీనివాస్ ట్రస్టు దర్శన సదుపాయం అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం కళావిహీనంగా మారిపోయింది.

కౌంటర్లు తెరవాలని భక్తుల డిమాండ్

ఇ-దర్శన్ కౌంటర్లను మళ్లీ తెరవాలనే డిమాండ్ వినిపిస్తోంది.గత ఏడాది ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు దీనిపై టీటీడీ ఈవోకు లేఖరాశారు. అయినప్పటికీ అప్పటి వైసీపీ ప్రభుత్వం, అధికారులు పట్టించుకోలేదు. ప్రమాదం జరిగిన నేపథ్యంలో మరోసారి ఈ డిమాండ్ తెరపైకి వచ్చింది. ఇప్పుడైనా పాలకులు, టీటీడీ అధికారులు స్పందించాలని భక్తులు కోరుతున్నారు.

క్రైం... crime news

మహిళా రైతు మెడలో పుస్తెల తాడు చోరీ

మునగపాక, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పొలంలో పని చేస్తున్న ఓ మహిళా రైతు మెడలోని పుస్తెల తాడు, నల్లపూసల గొలుసును ఓ ఆగంతకుడు తెంచుకుని పారిపోయాడు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గణపర్తి గ్రామానికి చెందిన కాండ్రేగుల సన్యాసమ్మ సోమవారం సాయంత్రం తన పొలంలో కలుపు తీత పనిచేస్తున్నది. 5.30 గంటల సమయంలో ఓ వ్యక్తి వచ్చి ఆమె మెడలోని రెండు తులాల బంగారం పుస్తెల తాడు, తులంన్నర నల్లపూసల గొలుసును బలవంతంగా తెచ్చుకుని బైక్‌పై పరారయ్యాడు. ఆమె మునగపాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

యువకుడిపై పోక్సో కేసు

రాంబిల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం చేశాడని అందిన ఫిర్యాదు మేరకు రాంబిల్లి మండలంలోని అప్పారాయుడుపాలేనికి చెందిన సేనాపతి నాగేంద్ర(20)పై మంగళవారం పోక్సో కేసు నమోదు చేసినట్టు రాంబిల్లి సీఐ నర్సింగరావు తెలిపారు. నాగేంద్ర ఐటీఐ చేసి పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నాడని, బాలిక తల్లి ఫిర్యాదు మేరకు అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

వాహనాల దొంగ అరెస్టు

ఎలమంచిలి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వాహనాల దొంగను పోలీసులు అరెస్టు చేసి ఒక ఆటో, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఎలమంచిలి సీఐ ధనుంజయరావు వెల్లడించిన వివరాలిలా వున్నాయి. ఎస్.రాయవరం మండలం కోనవానిపాలెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ సర్వసిద్ధి వరహాలు ఈ నెల 8న అడ్డరోడ్డు జంక్షన్ వద్ద తన ఆటోను సర్వీసు నిమిత్తం ఉంచాడు. అక్కడికి ఓ వ్యక్తి వచ్చి ఎలమంచిలి నుంచి కూరగాయలు తీసుకురావాలని బేరం కుదుర్చుకున్నాడు. ఎలమంచిలి దిమిలి రోడ్డు జంక్షన్ వద్ద ఆటో డ్రైవర్ టీ తాగేందుకని వెళ్లి వచ్చేసరికి ఆటో కనిపించలేదు. దీంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మంగళవారం పట్టణ పోలీసులు పెట్రోల్ బంకు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానం వచ్చి ఆటోను ఆపి డ్రైవర్‌ను విచారించారు. అతను ఆ ఆటోను చోరీ చేసినట్టు గుర్తించారు. నిందితుడు అచ్యుతాపురం మండలం పూడిమడక గ్రామానికి చెందిన ఎరిపిల్లి కాసుబాబుగా గుర్తించారు. అతను మరో రెండు ద్విచక్ర వాహనాలను చోరీ చేసినట్టు తెలుసుకున్నారు. వాహనాలను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



రుత్తల గోవింద్ (ఫైల్ ఫొటో)

నర్సీపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి పోలీసులు మంగళవారం తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని ఎరకన్నపాలెం గ్రామానికి చెందిన రుత్తల గోవింద్ ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తుంటాడు. వృత్తిపరమైన పని మీద సోమవారం ఉదయం బైక్‌పై నర్సీపట్నం వచ్చారు. మధ్యాహ్నం స్వగ్రామానికి తిరిగి వెళుతుండగా, ఎరకన్నపాలెం నుంచి వేమలపూడి వెళుతున్న ట్రాక్టర్ ఎర్రగొండిపాలెం వద్ద ఢీకొంది. దీంతో గోవింద్ తలకు బలమైన గాయమైంది. నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా, డాక్టర్ పరీక్షించి మృతి చెందినట్టు ధ్రువీకరించారు. అతని భార్య రుత్తల పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

ఎలమంచిలి చేరుకున్న ఆరోగ్య భారత్ రోలర్ స్కేటింగ్ యాత్ర

- 20 రాష్ట్రాల మీదుగా పయనం
- గత నెల 20న కాశీలో యాత్ర ప్రారంభం



ఎలమంచిలి చేరుకున్న సోనీ చౌరాసియా

ఎలమంచిలి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య భారత్ రోలర్ స్కేటింగ్ యాత్ర ద్వారా సుమారు 20 రాష్ట్రాలు మీదుగా 10,550 కిలో మీటర్లు మేర కొనసాగించిన సోనీ చౌరాసియా మంగళవారం ఎలమంచిలి చేరుకుంది. ఒడిశాకు చెందిన రాష్ట్రీయ స్వయం సేవక్ పరివార్ మహిళ సోనీ చౌరాసియా రోలింగ్ స్కేటింగ్ యాత్రను జనవరి 20న కాశీలో ప్రారంభించారు. హిందూ సనాతన ధర్మాన్ని చాటి చెబుతూ ఈ రోలింగ్ స్కేటింగ్ యాత్ర చేపడుతున్నట్టు ఆమె తెలిపారు. వారణాసికి చెందిన క్రీడా కళాభారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ యాత్ర సాగుతుందన్నారు. ఈ యాత్రలో ప్రధాన కూడళ్లలో పది వేలు మొక్కలు నాటే కార్యక్రమం కూడా జరుగుతుందన్నారు. జనవరి 20న ప్రారంభమైన ఈ యాత్ర మే 12వ తేదీన ముగుస్తుందని తెలిపారు.

22 నుంచి శాయి ట్రైనింగ్ సెంటర్ బాక్సింగ్, వాలీబాల్ ప్రవేశ ఎంపికలు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పోర్టు స్టేడియంలోని స్పోర్ట్సు అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) ట్రైనింగ్ సెంటర్‌లో బాక్సింగ్, వాలీబాల్ క్రీడల్లో శిక్షణ పొందేందుకు ప్రవేశ ఎంపికలు ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్నట్లు శాయ్ సెంటర్ ఇన్‌చార్జి ఎం.సత్యనారాయణ తెలిపారు. బాక్సింగ్ క్రీడకు సంబంధించి 12 నుంచి 14 ఏళ్లలోపు బాలురు 33 నుంచి 70 కిలోల వరకు లేదా ఆపైన బరువుతో రాష్ట్ర స్థాయి బాక్సింగ్ టోర్నీలో ప్రాతినిధ్యం వహించి ఉండాలి. 14 నుంచి 15 ఏళ్లలోపు వారు 46 నుంచి 80 వరకు లేదా ఆపైన బరువుతో జాతీయ బాక్సింగ్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించి ఉండాలి. 16 ఏళ్ల పైబడినవారు 46 నుంచి 80 వరకు లేదా ఆపైన బరువు కలిగి జాతీయ బాక్సింగ్ టోర్నీలో పతకం సాధించి ఉండాలి. బాలికలకు సంబంధించి 12 నుంచి 14 ఏళ్లలోపు వారు 40 కిలోల బరువు కలిగి రాష్ట్ర స్థాయి బాక్సింగ్ టోర్నీలో ప్రాతినిధ్యం వహించి ఉండాలి. 14 నుంచి 15 ఏళ్లలోపు వారు 56 వరకు లేదా ఆపై బరువుతో రాష్ట్ర స్థాయి బాక్సింగ్ టోర్నీలో ప్రాతినిధ్యం వహించాలి. 16 ఏళ్ల పైబడినవారు 56 వరకు లేదా ఆపై బరువు కలిగి జాతీయ బాక్సింగ్ టోర్నీలో పతకం సాధించి ఉండాలని స్పష్టం చేశారు. శిబిరానికి ఎంపికైనవారికి ఆధునిక శిక్షణ, వసతి, భోజనం, ఏడాదికి రూ.15 వేల విలువైన స్పోర్ట్సు కిట్, చదువు నిమిత్తం ఏడాదికి రూ.3 వేలు, పోటీల్లో పాల్గొనేందుకు ఏడాదికి రూ.5 వేలు, వైద్య ఖర్చులకు రూ.వెయ్యి, రూ.ఐదు లక్షల వైద్య బీమా కల్పిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఆధార్ కార్డు, వయసు ధ్రువీకరణ పత్రం, ఐదు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, క్రీడా ధ్రువపత్రాలు, మెడికల్ ఫిట్‌నెస్ ధ్రువపత్రంతో హాజరుకావాలన్నారు. వివరాలకు బాలుర బాక్సింగ్‌కు ఫోన్:8019149804, బాలికల బాక్సింగ్‌కు ఫోన్:8247443921, 9515188451, బాలుర వాలీబాల్‌కు ఫోన్:9491607748 నందు సంప్రదించాలన్నారు.

పూడిమడకలో మాఘ పౌర్ణమి జాతర ప్రారంభం



పూడిమడక తీరంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు జరుగుతున్న దృశ్యం



పూడిమడక తీరంలో ఏర్పాటు చేసిన పోలీస్ కంట్రోల్ పాయింట్

అచ్యుతాపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పూడిమడకలో మాఘ పౌర్ణమి జాతర మంగళవారం సాయంత్రం ప్రారంభమైంది. ఉదయం నుంచి, హోటళ్లు, మిఠాయి, తదితర దుకాణాలు ఏర్పాట్లు చేసుకున్నారు. తీరంలో మహిళలు స్నానానంతరం దుస్తులు మార్చుకోవడానికి ప్రత్యేకంగా టెంట్లు ఏర్పాటు చేశారు. విశాఖ జీవీఎంసీ నుంచి తెచ్చిన బయో టాయిలెట్లు తీరంలో సాయంత్రం ఏర్పాటు చేశారు. జాతర సందర్భంగా బాలుర రాష్ట్ర స్థాయి బీచ్ కబడ్డీ పోటీలను ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో రాష్ట్రం నలుమూలల నుంచి 16 జట్లు పాల్గొన్నాయి. రాత్రికి భారీ స్థాయిలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. జాతరకు వచ్చిన భక్తులకు మంచి నీరు, మజ్జిగ, పులిహోర పంపిణీ చేయడానికి వివిధ స్వచ్ఛంద సంస్థలు ఏర్పాట్లు చేస్తున్నాయి.

మాఘ పౌర్ణమి తీర్థానికి భద్రతా ఏర్పాట్లు

- ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు : డీఐజీ గోపీనాథ్ జెట్టి



పూడిమడక తీరంలో సూచనలిస్తున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి

అచ్యుతాపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పూడిమడకలో జరిగే మాఘ పౌర్ణమి తీర్థానికి అన్ని భద్రతా చర్యలు తీసుకున్నామని డీఐజీ గోపీనాథ్ జెట్టి తెలిపారు. మంగళవారం ఉదయం ఆయన ఎస్పీ తుహీన్ సిన్హా, డీఎస్పీ విష్ణు స్వరూప్‌లతో కలిసి పూడిమడక తీరాన్ని సందర్శించారు. సముద్ర స్నానాలకు వచ్చే భక్తులకు ఎటువంటి సౌకర్యాలు కల్పించారో తహసీల్దార్ జీవీ జనార్దన్‌ను అడిగి తెలుసుకున్నారు. తీరంలో మహిళలు సముద్ర స్నానానంతరం దుస్తులు మార్చుకోవడానికి తీరంలో ప్రత్యేకంగా టెంట్‌లు ఏర్పాటు చేశారు. తీరంలో హైమాస్ట్ లైట్లతో పాటు సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. తీర్థానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోలీస్ కంట్రోల్ రూమ్‌ను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట సీఐ నమ్మి గణేశ్, ఎంపీడీవో ప్రభాకరరావు, నిర్వాహకులు మేరుగు ప్రవీణ్, సూరాడ ధనరాజ్, మేరుగు చిన్న, దోని చంటి, ఉమ్మిడి చిన్న తదితరులు వున్నారు.

రేవుపోలవరంలో ఏర్పాట్ల పరిశీలన



రేవుపోలవరం సముద్రతీరం వద్ద ఏర్పాట్లపై మాట్లాడుతున్న ఆర్డీవో, డీఎస్పీ


ఎస్.రాయవరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మాఘ పౌర్ణమి జాతర సందర్భంగా మండలంలోని రేవుపోలవరం సముద్ర తీరంలో ఏర్పాట్లను మంగళవారం నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ, డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు ఇక్కడికి పుణ్య స్నానాలు ఆచరించడానికి రానున్న భక్తులందరికీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఆర్డీవో, డీఎస్పీ స్థానిక మండల నాయకులతో మాట్లాడి జాతరకు సంబంధించి పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. మాఘ పౌర్ణమి జాతర సందర్భంగా బుధవారం తరలిరానున్న జనాలకు ఇబ్బందులు కలగకుండా తాగునీరు, మెడికల్ క్యాంపు, గజ ఈతగాళ్లతో పాటు స్త్రీలు దుస్తులు మార్చుకోవడానికి గుడారాలు వంటి అన్ని ఏర్పాట్లు చేశారు. అలాగే అడ్డరోడ్డు సర్కిల్ కార్యాలయం వద్ద బందోబస్తుకు వచ్చిన పోలీసు సిబ్బందికి సీఐలు రామకృష్ణ, కుమారస్వామి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్‌బాబు, సీఐ రామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, టీడీపీ సీనియర్ నాయకులు ఎస్.వెంకటరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 5,030 మంది హాజరు

అనకాపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం పరీక్షకు 2,802 మంది విద్యార్థులు హాజరు కావాల్సి వుండగా, 2,729 మంది హాజరయ్యారు. 73 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు మొత్తం 2,353 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉంటే, 2,301 మంది హాజరయ్యారు. 52 మంది గైర్హాజరయ్యారు. ఉదయం, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు మొత్తం 5,030 మంది విద్యార్థులు హాజరయ్యారని డీవీఈవో సుజాత ఒక ప్రకటనలో తెలిపారు.

ఎర్రాజీ జ్యోతి ఖాతాలో మరో స్వర్ణం

- 200 మీటర్ల పరుగులో రికార్డు



విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విశాఖకు చెందిన అంతర్జాతీయ స్టార్ స్ప్రింటర్ ఎర్రాజీ జ్యోతి ఖాతాలో మరో పసిడి పతకం జమయింది. డెహ్రాడూన్‌లో మంగళవారం జరిగిన మహిళల 200 మీ. పరుగులో స్వర్ణ పతకం సాధించింది. హీట్స్‌లో 23.85 సెకన్లతో ఫైనల్స్‌కు క్వాలిఫై అయిన జ్యోతి..ఫైనల్ రేస్‌ను 23.53 సెకన్లలో పూర్తిచేసింది. దీంతో జాతీయ క్రీడల్లో ఆంధ్రాకు రెండు స్వర్ణ పతకాలు అందించింది. ఆమె విజయం అభినందనీయమని జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డి.నాగేశ్వరరావు, ఎం.నారాయణరావు పేర్కొన్నారు. జ్యోతిని ఒలింపిక్ సంఘం చైర్మన్ గణబాబు, అధ్యక్ష, కార్యదర్శులు ప్రసన్నకుమార్, కంచరాన సూర్యనారాయణ, మోహన్ వెంకటరామ్ అభినందించారు. జాతీయ క్రీడల్లో ఇప్పటివరకు ఆంధ్రకు ఐదు స్వర్ణ పతకాలు రాగా.. విశాఖకు చెందిన క్రీడాకారులు అథ్లెటిక్స్‌లో ఎర్రాజి జ్యోతి రెండు, బీచ్ వాలీబాల్‌లో మణికంఠరాజు-దివ్య సాయి ఒక స్వర్ణం అందించారు.

సంపతిపురం లేఅవుట్‌లో నకిలీ పట్టాలు

... 5వ పేజీ తరువాయి

కావాల్సిన సామగ్రిని తామే సరఫరా చేస్తామని, బయట కొనుగోలు చేసుకుంటే సామగ్రిని కాలనీలోకి అనుమతించేది లేదంటూ హుకుం జారీ చేశాడు. దీంతో భయపడిన కొంతమంది లబ్ధిదారులు.. అతను సరఫరా చేసిన మెటీరియల్‌ను తీసుకోవాల్సి వచ్చింది. మరికొంత మంది ఒప్పుకోకపోవడంతో మంత్రి అమర్‌నాథ్‌కు చెప్పి ఇంటి పట్టాను రద్దు చేయిస్తానని హెచ్చరించాడు. దీంతో వారు కూడా మెటీరియల్ కొనుగోలు చేసినట్టు చెబుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల నిర్మాణం

పేదలకు కేటాయించిన 72 గజాల స్థలంలో ఒక శ్లాబ్‌తో భవనం నిర్మించుకోవాలి. కానీ ఇక్కడ వైసీపీ నేత అండదండలతో సుమారు పది మంది రెండు అంతస్థుల భవనాలను నిర్మించారు. అయినా రెవెన్యూ, హౌసింగ్ అధికారులు పట్టించుకోవడంలేదు. వీరికి(రెండు అంతస్థులు నిర్మించిన) వైసీపీ నాయకుడు అండదండలు వుండడమే ఇందుకు కారణమని అంటున్నారు. కాగా సంపతిపురంలో నకిలీ పట్టాల జారీ, ఇళ్ల స్థలాల కేటాయింపుపై తహసీల్దార్, ఆర్డీవోలను వివరణ కోరేందుకు పలుమార్లు ఫోన్ చేయగా స్పందించలేదు.

పక్కాగా భూముల రీసర్వే

... 5వ పేజీ తరువాయి

వంటివి జరిగాయి. దీంతో రైతుల మధ్య వివాదాలు తలెత్తాయి. ఇవి పునరావృతం కాకుండా వుండేలా కూటమి ప్రభుత్వం పలు మార్గదర్శకాలను జారీ చేసింది.

250 ఎకరాలకు ఒక బృందం ఏర్పాటు

పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన గ్రామంలో ప్రతి 250 ఎకరాలకు ఒక సర్వే టీమ్‌ను ఏర్పాటు చేశారు. సచివాలయ సర్వేయర్లు ఇద్దరు, ఒక వీఆర్‌వో, ఒక వీఆర్ఏ టీమ్‌లో ఉంటారు. సర్వే టీమ్‌కి సపోర్ట్‌గా వీఆర్‌వో, విలేజ్ సర్వేయర్‌ను అదనంగా నియమించారు. వీరు సర్వే పురోగతిని ఎప్పటికప్పుడు అధికారులకు తెలియజేస్తారు. గ్రామంలో సర్వేకి వెళ్లినప్పుడు రైతుకి నోటీసు అందజేస్తున్నారు రైతు నుంచి అవసరమైన సమాచారం తీసుకొని తమ వద్ద ఉన్న రెవెన్యూ రికార్డుల ఆధారంగా రోవర్ మిషన్ సహాయంతో కొలుస్తున్నారు. పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాల్లో ఈ నెలాఖరుకు సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. రీ సర్వేలో ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేయడానికి 91216 22335 ఫోన్ నంబర్‌ను అందుబాటులో ఉంచారు.

రీసర్వేకి రైతులు సహకరించాలి

ఎంఆర్‌పీ బాబు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే

పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాల్లో భూముల సర్వే పనులు గత నెల 20వ తేదీన ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం సర్వే పనులు చురుగ్గా, పక్కాగా జరుగుతున్నాయి. మ్యుటేషన్ అవ్వని భూములు ఏమైనా ఉంటే త్వరగతిన ఆన్‌లైన్ చేయించుకోవాలి. గ్రామాల్లో సర్వే సిబ్బందికి రైతులు సహకరించాలి.

ముగ్గురు పంచాయతీ కార్యదర్శులు సస్పెన్షన్

... 5వ పేజీ తరువాయి

ఉత్తర్వులు జారీ చేశారు. నిధులు దుర్వినియోగం జరిగిన సమయంలో జి.కోడూరు పంచాయతీ కార్యదర్శులుగా శివప్రసాద్, అప్పలరెడ్డి, రాజారావులను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. శివప్రసాద్ ప్రస్తుతం కోటవురట్ల మండలంలో, అప్పలరెడ్డి మాడుగుల మండలంలో, రాజారావు మాకవరపాలెం మండలం శెట్టిపాలెంలో కార్యదర్శులుగా పనిచేస్తున్నారు. రాజారావు గిడుతూరు, లచ్చన్నపాలెం, జెడ్.గంగవరం పంచాయతీలకు ఇన్‌చార్జి కార్యదర్శిగా కూడా వ్యవహరిస్తున్నారు.

నామినేషన్లన్నీ ఓకే

... 5వ పేజీ తరువాయి

అభ్యర్థులు 20 సెట్ల నామినేషన్లు సమర్పించగా, వాటిలో నాలుగు సెట్లు తిరస్కరించామని, మిగిలినవన్నీ ప్రమాణాలకు అనుగుణంగా ఉండడంతో అన్నింటినీ ఆమోదిస్తున్నామని ప్రకటించారు. కాగా ఈనెల 13వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉందని తెలిపారు. మధ్యాహ్నం 3.30 గంటలకు పోటీలో ఉన్న అభ్యర్థులందరితో సమావేశం నిర్వహిస్తామన్నారు. ఇదిలా ఉండగా తుది జాబితా మేరకు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో మొత్తం 22,493 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. నామినేషన్ల పరిశీలన ప్రక్రియలో డీఆర్వో సీతారామారావు, ఎన్నికల సెల్ అధికారులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	96.00
లైవ్ ధర	116.00
విత్ స్కిన్	202.00
స్కిన్ లెస్	212.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469